మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 31-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 212 Issue: 212

Published from Jagitial www.evarthalu.com

31 జనవరి 2026 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 6:07 తిథి త్రయోదశి ఉ. 8:26 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పునర్వసు రా. 1:33 వరకు తరువాత పుష్యమి యోగం విష్కంభ మ. 1:34 వరకు కరణం తైతుల ఉ. 8:26 వరకు గరజ రా. 7:09 వరకు వర్జ్యం మ. 2:30 నుండి మ. 3:58 వరకు దుర్ముహూర్తం ఉ. 8:22 నుండి ఉ. 9:07 వరకు రాహుకాలం ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు యమగండం మ. 1:54 నుండి మ. 3:18 వరకు గుళికాకాలం ఉ. 6:52 నుండి ఉ. 8:16 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు రా. 11:20 నుండి రా. 12:48 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:52 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# విద్యార్థినులకు ఫ్రీగా శానిటరీ న్యాప్కిన్స్



**నెలసరి పరిశుభ్రత మహిళల ప్రాథమిక హక్కు**

**ఈ విషయంలో స్కూళ్లు జాగ్రత్తలు తీసుకోవాలి**

**ఉచితంగా ప్యాడ్స్ అందించాలి: సుప్రీం కోర్టు**

మహిళల ఆరోగ్యానికి సంబంధించి నెలసరి పరిశుభ్రత (మెనుస్ట్రువల్ హైజీన్)పై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కు కిందకే వస్తుందని, స్కూళ్లలో విద్యార్థినిల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. స్కూళ్లలో విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందించాలని, ప్రత్యేక టాయిలెట్లు ఉండాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఆధ్వర్యంలోని సుప్రీం బెంచ్ విచారించి తాజా సూచనలు చేసింది. ఈ మేరకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది.

న్యూఢిల్లీ: 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కే. పాఠశాలల్లోని విద్యార్థినులకు స్కూళ్లలో పర్యావరణ హితమైన శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా అందించాలి. విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ అందించడాన్ని దాతృత్వంలాగా చూడకూడదు. అలాగే విధానపరమైన నిర్ణయం తీసుకోవడం ద్వారానో అమలు చేయకూడదు. ఇది రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుగా చూడాలి. విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా టాయిలెట్లు ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు ఈ ఆదేశాలు పాటించాలి. ఒకవేళ ఇలా వేర్వేరు టాయిలెట్లు లేకపోతే గుర్తింపు రద్దు చేయొచ్చు. విద్యార్థినుల హక్కులను తరువాయి 2 వ పేజీలో...

# ఫాంహౌజ్‌లో.. కుదరదు





## మా రికార్డుల్లో నందినగర్ అడ్రస్సే ఉంది

## విచారణపై కేసీఆర్‌కు సిట్ స్పష్టీకరణ

## బీఆర్ఎస్ అధినేత అభ్యర్థన తిరస్కరణ

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ అధికారులు షాక్ ఇచ్చారు. ఫాంహౌస్‌లో విచారించాలన్న విజ్ఞప్తిని తిరస్కరించారు. నందినగర్‌లోని నివాసంలోనే విచారిస్తామని అందుకు సహకరించాలని సిట్ కోరింది. ఈ మేరకు శుక్రవారం రెండోసారి నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. అంతేకాదు, ఇకపై ప్రతి నోటీసులు కూడా ఫాంహౌస్‌కే పంపించాలన్న అభ్యర్థనను సైతం సిట్ తిరస్కరించింది. మున్సిపల్ ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాతే విచారణకు వస్తానని, అలాగే విచారణను తన ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో జరపాలని కేసీఆర్ సిట్‌ను కోరారు.

హైదరాబాద్, జనవరి 30 (ఈవార్తలు): అయితే ఈ రెండు అభ్యర్థనలను సిట్ నిరాకరించింది. ఎర్రవల్లి ఫాంహౌస్‌లో విచారణ సాధ్యం కాదని తేల్చిచెప్పింది. గురువారం నాటి నోటీసుల్లో 65 ఏళ్ల వయసు దృష్ట్యా పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని కేసీఆర్‌కు సిట్ సూచించింది. విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం వివరాలను తెలపాలని సూచించింది. అక్కడకు వచ్చి విచారిస్తామని నోటీసుల్లో పేర్కొంది. అయితే కేసీఆర్ మాత్రం ఫాంహౌజ్‌లో విచారించాలని సిట్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ కీలక నేతలు కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్‌రావును సిట్ విచారించిన సంగతి తెలిసిందే. వారు తరువాయి 2 వ పేజీలో...



# సర్టిఫికెట్లు ఆపితే ఖబడ్దార్!

## ఆ హక్కు ఏ విద్యాసంస్థకు లేదు

**ఫీజు బకాయిలపై సర్కారు లెక్కలివ్వాలి.. తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం తెలంగాణలో మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొన్ని కాలేజీలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను వారి వద్దే ఉంచుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ఫీజు రీయింబర్స్ మెంట్ నుంచి డబ్బుల అందలేదన్న కారణంతో ఇలా చేస్తున్నాయి. ఇటువంటి కాలేజీల తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రేవంత్ సర్కార్‌కు ఆదేశాలు జారీ చేసింది.

హైదరాబాద్, జనవరి 30 (ఈవార్తలు): విద్యార్థులకు రావాల్సిన ఫీజులు ఇంకా రాలేదన్న కారణంతో వారిని వేధించడం సరికాదని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. బకాయిల కారణంగా వారి సర్టిఫికెట్లను ఆపి ఉంచే హక్కు ఏ విద్యా సంస్థకు లేదని పేర్కొంది. ఇది విద్యార్థుల తరువాయి 2 వ పేజీలో...

# సిగాచి పరిహారమేది?

## ఇంకెప్పుడిస్తారు? ఎంతిస్తారు?

## రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ఫైర్



హైదరాబాద్, జనవరి 30 (ఈవార్తలు): పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో సంభవించిన భారీ పేలుడులో మరణించిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వకుండా తప్పించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వంపై హై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. బాధితులకు పరిహారం ఆలస్యంపై, ప్రమాదంపై దర్యాప్తు కోసం సిట్ వేయాలని హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు స్పందించింది. సిగాచి బాధితులకు పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు? ఎప్పుడు ఎంత ఇస్తారు? అంటూహైకోర్టు ప్రశ్నలు తరువాయి 2 వ పేజీలో...



**బంగారం-వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,920 |
| వెండి (గ్రాము): | రూ.405 |
| ప్లాటినం (గ్రాము): | రూ.7,393 |



# శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు లేదు

## కృత్రిమ రసాయనాలు వాడినట్లు తేలింది

## తేల్చి చెప్పిన సీబీఐ సిట్.. చార్జిషీట్ సమర్పణ

తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై విచారణ చేసిన సీబీఐ.. శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు వాడినట్లు ఆధారాలు లేవని తెలిపింది. జంతువుల నుంచి తీసిన కల్తీ నెయ్యిని ఉపయోగించలేదని వెల్లడించింది. జగన్ ప్రభుత్వం హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో.. సీబీఐ విచారణకు వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సీబీఐ విచారణ చేపట్టి.. ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని, కల్తీ జరగలేదని నివేదిక సమర్పించింది.

తిరుమల/విజయవాడ, జనవరి 30 (ఈవార్తలు): శుక్రవారం ఫైనల్ చార్జిషీట్‌ను సమర్పించింది. అయితే, నెయ్యిలో కూరగాయల నూనెలు, కృత్రిమ పాల ఉత్పత్తులలో వాడే ఈస్టర్‌లు కలిపి కల్తీ చేశారని వెల్లడించింది. ఇక, ఫైనల్ చార్జిషీట్‌లో 36 మందిని నిందితులుగా పేర్కొన్న సిట్.. తొమ్మిది మంది టీటీడీ అధికారులు, ఐదుగురు డెయిరీ సంబంధించిన వ్యక్తులు ఉన్నట్లు పేర్కొంది.

**హిందువుల మనోభావాలతో కూటమి ఆటలు: భూమన**

సిట్ సమర్పించిన ఫైనల్ చార్జిషీట్‌పై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పందించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు తరువాయి 2 వ పేజీలో...



# అడవితల్లుల దర్శనం

## భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ.. నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

మేడారం మహా జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వన దేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో మేడారం పరిసరాలు జనసంద్రంగా మారాయి. భారీగా తరలివచ్చిన భక్తులను నియంత్రించడం అధికారులకు సవాలుగా మారింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా మేడారం సందర్శించి, వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

(మేడారం-ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి)

బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెలపైకి చేరడంతో గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు తమ మొక్కులు చెల్లించుకోవడం ప్రారంభించారు. అయితే, గురువారం రాత్రి జాతర ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన తరువాయి 2 వ పేజీలో...

**విశ్వవాణి**



బ్రెజిల్‌లో చెరుకు వ్యర్థాలను పడేయకుండా, రోడ్ల నిర్మించేందుకు వాడుతున్నారు. రోడ్ల నిర్మాణంలో వాడే ఆస్ఫాల్ట్ స్థానంలో చెరుకును మండించగా వచ్చిన బూడిదను వాడుతున్నారు. దానివల్ల సాధారణ రోడ్ల కన్నా అవి అధిక సామర్థ్యంతో, మన్నికతో, పర్యావరణహితంగా ఉంటున్నాయట.

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్



**నేడు సాయంత్రం 5 గంటలకు ప్రమాణం!**

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణంతో తదుపరి ఉపముఖ్యమంత్రి ఆయన భార్య సునేత్ర పవార్ నియామకం ఖరారైంది. దివంగత అజిత్ దాదా స్థానంలో ఆమె శనివారం ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ముంబై: భర్త మరణంతో కుంగిపోయిన ఆమె.. ఎన్సీపీ సీనియర్ నేతల ప్రతిపాదనను అంగీకరిస్తూ బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకొచ్చారు. మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర గుర్తింపు సాధించనున్నారు. బారమతి విమాన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణంతో తదుపరి డిప్యూటీ సీఎం ఎవరు? నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని నడిపించేది ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అజిత్ దాదా వారసత్వాన్ని -2 వ పేజీలో...




## ముగిసిన నామినేషన్లు

**నేడు దరఖాస్తుల పరిశీలన**

**రిజెక్ట్ అయితే 1న అప్పీల్**

హైదరాబాద్, జనవరి 30 (ఈవార్తలు): రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారుల వద్ద సమర్పించారు. సాయంత్రం - 2 వ పేజీలో...

# బంగారం, వెండి.. ధమాల్!

## ఒక్క రోజులోనే 10 వేలు తగ్గిన గోల్డ్.. రూ.20,000 తగ్గిన కిలో సిల్వర్ ధర



హైదరాబాద్, జనవరి 30 (ఈవార్తలు): ఆకాశమే హద్దుగా పెరుగుతున్న బంగారం, వెండి ధరలకు బ్రేక్ పడింది. శుక్రవారం గోల్డ్ రేటు ఏకంగా రూ. 9,650 తగ్గింది. ఇదే బాటలో వెండి కూడా అడుగులు వేసింది. కిలో వెండి ధర రూ. 20,000 తగ్గింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,69,200 వద్ద ఉండగా, 22 క్యారెట్ల తులం గోల్డ్ రేటు 1,55,100 రూపాయల వద్ద

# రాశి ఫలాలు



31.1.2026

మేషం: ఆర్థికంగా మరింత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. నూతన వస్తు వాహనాలు చేస్తారు. ఇంటాబయట నూతన ప్రణాళికలను అమలు పరుస్తారు. చేపట్టిన పనుల్లో కార్యసిద్ధి కలుగుతుంది. బంధువుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన పురోగతి లభిస్తుంది. ఉద్యోగ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. బంధుమిత్రులతో వివాదాలు ఉంటాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. చేపట్టిన పనులను మరింత మందకొడిగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు కలసి వస్తాయి. ఉద్యోగమున అధికారులతో సమస్యలు కలుగుతాయి.

మిథునం: ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనులలో మీ శ్రమ ఫలిస్తుంది. నూతన వ్యక్తులతో పరిచయాలు లాభసాటిగా ఉంటాయి. ఇంటాబయట నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగస్తులకు వివాదాలు తీరి ఊరట చెందుతారు.

కర్కాటకం: రాజకీయ సంబంధిత సమావేశాల్లో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన ఉద్యోగ యత్నాలు కలసి వస్తాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితాలు అందుకుంటారు. ఉద్యోగమున మీ పని తీరుతో అందరినీ ఆకట్టుకుంటారు.

సింహం: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. బంధుమిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. సోదరుల నుండి ధన పరమైన ఇబ్బందులు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

కన్య: ముఖ్యమైన వ్యవహారాలలో పరిస్థితులు అనుకూలించవు. వ్యయ ప్రయాసలతో కానీ పనులు పూర్తి కావు. బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. ధన పరంగా ఆలోచనలో స్థిరత్వం ఉండదు. వ్యాపార ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదుర్కొంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలించవు.

తుల: గృహంలో సంతోషకరమైన వాతావరణం ఉంటుంది. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమ ఫలిస్తుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన కార్యక్రమాలను ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో చికాకులు అధిగమించి ముందుకు సాగుతారు.

వృశ్చికం: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆకస్మిక ధనలాభం సూచనలు ఉన్నవి. పాత విషయాలు జ్ఞప్తికి తెచ్చుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్నేహితుల సహాయ సహకారాలు అందుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వ్యాపార ఉద్యోగాలలో మీ అంచనాలు నిజమవుతాయి.

ధనస్సు: దైవ సంబంధిత కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ సభ్యులతో వివాదాలు ఉంటాయి. ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఆరోగ్య విషయంలో కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థికంగా ఇబ్బందులు కలుగుతాయి.

మకరం: ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలించవు. చేపట్టిన పనులలో స్థిరమైన ఆలోచనలు చేయలేరు. ఇంటాబయటా బాధ్యతలు పెరుగుతాయి. నిరాశ కలుగుతుంది. ఆర్థికంగా ఒడిదుడుకులు తప్పవు. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి.

కుంభం: కీలక వ్యవహారాల్లో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో సఖ్యతగా వ్యవహరించి మీ మాటకు విలువ పెంచుకుంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపారాలలో నూతన నిర్ణయాలు తీసుకొని లాభాలు అందుకుంటారు. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు సానుకూలమవుతాయి.

మీనం: దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. అధిక శ్రమతో స్వల్ప ఫలితం పొందుతారు. చిన్ననాటి మిత్రులతో వివాదాలు కలుగుతాయి. ఆరోగ్యపరంగా అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. వ్యాపార ఉద్యోగాలలో చికాకులు తొలగుతాయి.

# ఫాంహౌజ్‌లో..కుదరదు

మొదటి పేజీ తరువాయి

ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేసీఆర్‌ను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించడంతో ఆయన ఎలా స్పందిస్తారనేది ఆసక్తిగా మారింది. ఫిబ్రవరి 1న సిట్ విచారణకు హాజరవుతారా? లేక మరోసారి గడువు కోరుతారా? లీగల్ ఒపీనియన్ ప్రకారం నడుచుకుం టారా? అన్నది తేలాల్సి ఉంది.



### నందినగర్ ఇంటి గోడకు నోటీసులు

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మరోసారి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం రాత్రి నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు. అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఇంటి గోడకు నోటీసులు అంటించి వెళ్లారు. ఫిబ్రవరి 1వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్ నివాసంలో అందుబాటులో ఉండాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అనంతరం సిట్ అధికారులు అక్కడ మీడియాతో మాట్లాడారు. తమ రికార్డ్స్‌లో నందినగర్ నివాసానికి సంబంధించిన అడ్రస్సే ఉందని అన్నారు. 'ఫాంహౌజ్ అడ్రస్ లేదు కాబట్టి అక్కడ విచారించడం కుదరదు. విచారణ సమయంలో ఉపయోగించే పరికరాలను కూడా ఫామ్‌హౌజ్‌కు తీసుకెళ్లలేం' అని పేర్కొన్నారు.

### కేసీఆర్‌తో కేటీఆర్, జగదీశ్ భేటీ

గజ్వేల్, జనవరి 30 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఆయన తనయుడు కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో వారిద్దరు సమావేశమయ్యారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలు, సిట్ నోటీసులపై వీరు ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. అటు.. ఫోన్ ట్యాపింగ్ కేసు అంశానికి సంబంధించి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే సిట్ నోటీసులపైనా వారు చర్చించినట్లు తెలిసింది.



## విద్యార్థినులకు ఫ్రీగా శానిటరీ న్యాప్కిన్స్

మొదటి పేజీ తరువాయి

పాటించకపోతే అది ఆర్టికల్ 14 ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. బాలికలకు శానిటరీ ప్యాడ్స్ అందించడంలో విఫలమైతే ప్రభుత్వానిదే బాధ్యత. స్కూళ్లలో సరైన సౌకర్యాలు లేకపోతే బాలికల ఆరోగ్యం దెబ్బతింటుంది. స్కూళ్లలో శానిటరీ ప్యాడ్స్ అడగడానికి విద్యార్థినులు సంకోచించకూడదు. అలాగే.. టీచర్లు వారికి ఇవ్వాలని ఉన్నా వనరుల సమస్య ఉండకూడదు. సరైన, నాణ్యమైన, ప్రభావవంతమైన నెలసరి పారిశుధ్యాన్ని పాటిస్తే అది ఆడపిల్లల ఆరోగ్యానికి, మంచి చదువుకు కూడా దోహద పడుతుంది' అని సుప్రీం కోర్టు పేర్కొంది.

## సర్టిఫికెట్లు ఆపితే ఖబడ్దార్!

మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాయడమే అని తెలిపింది. సర్టిఫికెట్లు చేతికి వస్తేనే ఉద్యోగం చేయాలన్నా, ఉన్నత చదువులకు వెళ్లాలన్నా వీలవుతుంది. లేకపోతే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. సర్టిఫికెట్లు ఆపితే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని, దానికి కాలేజీలే బాధ్యత వహించాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే ప్రభుత్వం నుంచి కాలేజీలకు ఎంత మొత్తం రావాలి..? ఆ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారు..? అనే అంశాలపై రెండు వారాల్లోగా పూర్తి నివేదిక సమర్పించాలని కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతే కాకుండా.. కాలేజీల వేధింపులకు గురవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలని లేదంటే.. ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేయాలని సూచించింది. అంతే కాకుండా.. విద్యార్థుల సమస్యలను చెప్పుకోవడానికి.. దానికి తక్షణమే పరిష్కారం పొందేందుకు ఒక అధికారిని కూడా నియమించాలని పేర్కొంది.



## మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్

మొదటి పేజీ తరువాయి

కొనసాగించేందుకు సునేత్రనే సరైన వ్యక్తి అని సీనియర్ నాయకులు తీర్మానించారు. దీనిపై ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తోనూ చర్చలు జరిపారు. ఫడ్నవీస్ సైతం సునేత్రను డిప్యూటీ సీఎంగా నియమించేందుకు ఆమోద ముద్ర వేశారని సమాచారం. శనివారం సాయంత్రం 5 గంటలకు సునేత్ర ప్రమాణ స్వీకారం చేస్తారని ఎన్సీపీ నేతలు అంటున్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగుతున్న సునేత్ర ఇకపై రాష్ట్ర రాజకీయాల్లో తన భర్త అజిత్ స్ఫూర్తితో ముందుకు వెళ్లనున్నారు. డిప్యూటీ సీఎం పదవి చేపట్టాక ఆమె ఎక్సైజ్, క్రీడా శాఖలు చూసుకుంటారని సమాచారం.

## బంగారం, వెండి.. ఢమాల్!

మొదటి పేజీ తరువాయి



ఉంది. వెండి ధర రూ. 4.25 లక్షల నుంచి.. రూ. 4.05 లక్షల వద్దకు పడిపోయింది. అంటే గంటల వ్యవధిలో కేజీ సిల్వర్ రేటు 20 వేలు తగ్గిందన్నమాట. డాలర్ మళ్లీ బలపడుతోందని... అందుకే ధరల తగ్గుదల అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రూపాయితో పోలిస్తే డాలర్ రికార్డు స్థాయికి చేరడంతో మార్కెట్ పై ఒత్తిడి పెరిగిందని తెలిపారు. ఇన్వెస్టర్లు కూడా ప్రాఫిట్ బుకింగ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. డాలర్ బలంగా ఉన్నప్పుడు లోహాలు చౌకగా అవుతాయి. ఈ క్రమంలోనే బంగారం, వెండితో పాటు ఇతర మెటల్స్ ధరలు తగ్గాయి. దీనికి తోడు కేంద్ర బడ్జెట్ ఉండటం కూడా మార్కెట్ పై ప్రభావం చూపుతోంది. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మెటల్స్ లో ప్రాఫిట్ బుకింగ్ చేయడానికి ఇది కూడా ఒక కారణమే. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను మార్చకుండా ఉంచడం కూడా డాలర్ ను బలోపేతం చేసింది. ధరల్లో ఊగిసలాట కొనసాగవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

### బంగారం ధరల పెరుగుదల నీటి బుడగ: విలియం లీ

బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. దీన్ని చూసి చాలామంది బంగారం కొనుగోళ్లపై దృష్టి సారించారు. అయితే, రేట్ల పెరుగుదల విషయంలో ప్రజలు ఆత్రుత పడవద్దని, ఆ ధరల పెరుగుదల నీటి బుడగతో సమానం అని గ్లోబల్ ఎకనామిక్ అడ్వైజర్స్ చీఫ్ ఎకనామిస్ట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ విలియం లీఅన్నారు. ప్రపంచ రాజకీయ, సామాజిక పరిస్థితులే ధరల పెరుగుదలకు కారణం అని పేర్కొన్నారు. ఆ బుడగ ఎప్పుడైనా పగిలిపోయే అవకాశం ఉందని, ఏ సమయంలో అయినా బంగారం ధరలు భారీగా తగ్గిపోతాయని అన్నారు.




## ముగిసిన నామినేషన్లు

మొదటి పేజీ తరువాయి

ఐదు గంటల వరకు కార్యాలయంలో ఉన్న అభ్యర్థుల నామినేషన్లను అధికారులు స్వీకరించారు. శనివారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. నామినేషన్ రిజెక్ట్ అయిన అభ్యర్థులకు రాష్ట్ర ఎన్నికల సంఘం అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 1న రిజెక్ట్ పై అప్పీల్ చేసుకున్న అభ్యర్థుల కేసులను ఫిబ్రవరి 2న అధికారులు పరిశీలించనున్నారు. ఫిబ్రవరి 3వ తేదీ నాటికి ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుంది. అదే రోజున తుది అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు ప్రకటించనున్నారు. దీంతో ఎన్నికల పోరాటంలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాపై స్పష్టత వస్తుంది. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. అదే రోజున ఓట్ల లెక్కింపు కూడా చేపట్టనున్నారు.

## అడవితల్లుల దర్శనం

మొదటి పేజీ తరువాయి

కొందరు భక్తులు, అక్కడే ఉన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కారు అద్దాలను, సమీపంలోని దుకాణాలను ధ్వంసం చేశారు. ఈ నెల 28న ప్రారంభమైన ఈ జాతర శనివారంతో ముగియనుంది.

### 8 కిలోమీటర్ల ట్రాఫిక్ జాం



గద్దెలపై కొలువు దీరిన వన దేవతలను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల తో మేడారం భక్తజన సంద్రంగా మారింది. మరో వైపు జాతరలో సమ్మక్కను దర్శించుకొని తిరిగి ఇండ్లకు వెళ్లే వారి సంఖ్య కూడా భారీగానే ఉంది.దీంతో ఆ రూట్ కూడా బిజీగా మారింది. మేడారం దారిలో గోవిందరావుపేట మం డలం పసరాలో ఇండియన్ పెట్రోల్ బంక్ నుంచి పసర ఆర్చ్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. తాడ్వాయి నుంచి మేడారం రూట్ లో సుమారు 8 కిలోమీ టర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. మూడు వరుసల్లో వాహనాలు నిలిచిపోవడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వెహికి ల్స్ స్లోగా వెళ్తున్నాయి. దీంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం చేస్తున్న వాహనాలతో పాటు మహా జాతరకు భారీగా భక్తులు తరలివస్తుండటంతో ఈ ట్రాఫిక్ జామ్ ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. పరిస్థితి చక్కదిద్దేందుకు పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టి వా హనాలను క్రమబద్ధీకరించాల్సి వచ్చింది.



## సిగాచి పరిహారమేది?

మొదటి పేజీ తరువాయి

కురిపించింది. గత ఏడాది సిగాచి కంపెనీలో జరిగిన పేలుడులో 58 మంది దుర్మరణం చెందగా.. 8 మంది ఆచూకీ తెలియలేదు. ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి బాధిత కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇప్పిస్తామని ప్రకటించారు. అయితే.. ఈఎస్ఐ చట్టం ప్రకారం రూ.42 లక్షలు ఇచ్చేందుకు సిగాచి కంపెనీ యాజయాన్యం అంగీకరించింది. ప్రభుత్వం తరఫున ఇవ్వాల్సిన రూ. 58 లక్షల పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించకపోవడంపై హైకోర్టు సీరియస్ అయింది. సిగాచి పరిహారంపై నివేదిక ఇవ్వాలని ఈపీఎఫ్, ఈఎస్ఐ అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేసింది.

# శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు లేదు

మొదటి పేజీ తరువాయి

ఉద్దేశపూర్వకంగా హిందూ మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. జగన్ ను రాజకీయంగా దెబ్బతీయాలనే ఏకైక ఉద్దేశంతోనే తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతు కొవ్వు వాడారని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. నిరాధారమైన ఆరోపణలతో జగన్ ను కించపరచడమే కాకుండా.. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి పవిత్రత, ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. గత ఏడాదిన్నర కాలంగా.. ప్రపంచవ్యాప్తంగా 1.4 బిలియన్లకు పైగా హిందువులు ఈ తప్పుడు ప్రచారంతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని అన్నారు.

### తూచ్.. కల్తీ నెయ్యి: టీటీడీ ఛైర్మన్

తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ ఛార్జిషీట్‌పై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో శుక్రవారం బీఆర్ నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై క్లీన్ చిట్ అంటూ భక్తులను మోసం చేస్తున్నారని విమర్శించారు. టీటీడీ పవిత్రతను భ్రష్టు పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. నెయ్యి కల్తీ జరగలేదని సిట్ చెప్పిందనడం వాస్తవం కాదని, సిట్ ఛార్జ్‌షీట్‌లోనే కల్తీ స్పష్టంగా నమోదైందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీకి నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘన జరిగిందని, కొందరికి లాభం చేకూర్చే విధంగా నిబంధనలను మార్చారని ఆరోపించారు. సరైన సామర్థ్యం లేని సంస్థలకు నెయ్యి టెండర్లు అప్పగించారని, సుమారు రూ. 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి కొనుగోలు జరిగిందన్నారు. ఈ నెయ్యిని పరీక్షించిన ఎన్‌డీడీబీ జంతు కొవ్వు ఉందని నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. ఒక్క ఆవు కూడా లేకుండా, చుక్క నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి తయారు చేశామని చెప్పడం అబద్ధమని, నెయ్యి తయారీలో వాడిన కొన్ని రసాయనాలు అత్యంత ప్రమాదకరమైనవని ఆందోళన వ్యక్తం చేశారు.







# అమ్మవార్ల దర్శనానికి కోటెత్తిన భక్తులు

మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరిన భక్తులతో మేడారం పోటెత్తింది. శుక్రవారం సమ్మక్క, సారలమ్మ, పగడిద్దరాజు, గోవిందరాజులు ప్రధాన గద్దెలపై ఆసీనులైన క్షణాన నేల కనిపించనంతగా జనం తరలివచ్చింది. జంపన్నవాగు ఇసుకేస్తే రాలని విధంగా మారింది. వన దేవతల దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తజనం భారీగా తరలిరావడంతో అమ్మల సన్నిధిలో జనసమ్మర్ద దృశ్యం ఆవిష్కృతమైంది.నెత్తిన బంగారం మూటలు, చంకన పిల్లల్ని ఎత్తుకొని భక్తులు తమకెన్ని ఇబ్బందులు ఎదురైనా సరే తల్లుల దర్శనం ముందు అవన్నీ దిగదుడుపేనని భావించా రు. రద్దీ విపరీతంగా పెరగడంతో వీఐపీ, వీవీఐపీ సందర్శకుల కోసం జారీ చేసిన ప్రత్యేక పా సులు కలిగి ఉన్న క్యూలను తొలగించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈసారి మహా జాతరకు శుక్రవారం వరకు కోటి 50 లక్షల మంది భక్తులు తల్లుల్ని దర్శించు కున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు.



## హౌజింగ్ కార్పొరేషన్‌కు డబుల్ ఇండ్లు

**రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

హైదరాబాద్, జనవరి 30 (ఈవార్తలు): రాష్ట్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వివిధ ఇంజనీరింగ్ శాఖల పర్యవేక్షణలో ఉన్న అన్ని 2 బీహెచ్‌కే ప్రాజెక్టులను ఇకపై తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీహెచ్సీఎస్) పరిధిలోకి బదిలీ చేస్తూ రవాణా, రహదారులు మరియు భవనాల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరింత వేగంగా నిర్మాణాలు, ప్రాజెక్టుల పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు జీవో ఎంఎస్ నంబర్ 5ను విడుదల చేశారు. గతంలో ఇతర ఇంజనీరింగ్ శాఖలకు అప్పగించిన అన్ని డబుల్ బెడ్రూం ప్రాజెక్టులను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాల్లో ఉన్న ప్రాజెక్టులను ప్రస్తుత ఏజెన్సీల నుండి సంబంధిత హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లకు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రాజెక్టులను బదిలీ చేసే బాధ్యతను కమిషనర్‌కు అప్పగించారు. ఇళ్ల పూర్తి, కేటాయింపు ప్రక్రియలో గత ఏడాది మార్చి 22న విడుదల చేసిన జీవో నంబర్ 33లోని సమగ్ర మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## జగిత్యాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారు?

**నిజం చెప్తే మున్సిపల్ బరి నుంచి తప్పుకుంటాం**

**నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సంచలన సవాల్**

జగిత్యాల, జనవరి 30 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వద్ద నిధులు లేవని ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను పదేళ్ల పాటు బీఆర్ఎస్ నేతలు మింగితే.. ఇప్పుడు కాంగ్రెస్ నేతలు మింగేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరూ తోడు దొంగలు అని అన్నారు. అందుకే కేసీఆర్‌ను అరెస్ట్ చేసేందుకు రేవంత్ రెడ్డి భయపడుతున్నారని విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ ఏ పార్టీలో ఉన్నారో చెబితే.. తాము జగిత్యాల మున్సిపల్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటామని సంచలన సవాల్ చేశారు. మరోవైపు.. ఇవాళ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది.

# క్లీన్ ఎనర్జీ దిశగా భారత్

**వికసిత్ భారత్‌లో పర్యావరణహిత ఇంధనం భాగం**

**పీఎం ప్రధాన కార్యదర్శి పీకే మిశ్రా**




న్యూఢిల్లీ: క్లీన్ ఎనర్జీ దిశగా భారత్ కీలక అడుగులు వేసిందని ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీకే మిశ్రా అన్నారు. శుక్రవారం ఐఆర్ఏడీఈలో 'సుస్థిర ఇంధన పరివర్తన- ప్రపంచ దృక్పథం' అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో ఆయన ప్రసంగించారు. వికసిత్ భారత్ ఒక్క రంగానికే పరిమితం కాదని, వృద్ధి, పోటీతత్వం, సామాజిక సమ్మిళితం, ఇంధన భద్రతకు కేంద్రమని అన్నారు. గత సంవత్సరం భారత ఇంధన వారోత్సవాల సందర్భంగా 'పర్యావరణ హిత ఇంధనం, హరిత వృద్ధి, సుస్థిర జీవనశైలిపైనే అభివృద్ధి చెందిన భారత్ నిర్మితమవుతుంది' అని ప్రధాని మోదీ చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ.. 2014 నుంచి భారత ఇంధన పరివర్తన రెండు కీలక పాఠాలను మనకు అందిస్తోందని తెలిపారు. మొదటిది.. సంస్థాగత నిర్మాణం, స్థిరమైన ఆర్థిక నిబద్ధత, నిరంతర అమలు మద్దతు గల ప్రతిష్టాత్మక లక్ష్యాలు మాత్రమే విశ్వసనీయతను పొందుతాయి. పర్యావరణ హిత ఇంధనాల కోసం స్థాపిత సామర్థ్యంలో 50 శాతాన్ని 2030 నాటికి సాధించాల్సి ఉండగా, దానిని 2025 నాటికే సాధించగలగడంలో భారత్ సామర్థ్యం, మునుపటి అంచనాల కంటే చాలా ముందుగానే 100 గిగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని సాధించడం వంటివి మన విధానాల కొనసాగింపు, సంస్థాగత బలాల ప్రాముఖ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. రెండోది.. ఇంధన పరివర్తనలు స్పష్టమైన సంక్షేమ ఫలాలను అందించినప్పుడు అవి అత్యంత సుస్థిరమైనవి అవుతాయి. రైతులపై పీఎమ్ కుసుమ్ ప్రభావం, గృహాలకు పీఎమ్ సూర్య ఘర్ ద్వారా కలిగిన ఉపశమనం, సౌర విద్యుత్ తయారీ, విద్యుత్ వాహనాల ద్వారా లభించిన ఉద్యోగాలు... డీకార్బనైజేషన్–అభివృద్ధి ఒకదానినొకటి బలహీనపరుచుకోవడం కన్నా మరింత బలోపేతం చేసుకోగలవని నిరూపించాయని వ్యాఖ్యానించారు. గ్లోబల్ సౌత్ కోసం ఇంధన భద్రత, అందుబాటు ధరలు, అందరికీ అందుబాటులో ఉంచడం కీలకమని డాక్టర్ మిశ్రా అభిప్రాయపడ్డారు. ఈ పరివర్తన న్యాయబద్ధంగా, సమ్మిళితంగా, అభివృద్ధికి అనుగుణంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. విభిన్న బాధ్యతలు, జాతీయ పరిస్థితులు, సుస్థిర అంతర్జాతీయ సహకారం అవసరాన్నీ ప్రస్తావించారు. భారత్ 2005–2020 మధ్య తన జీడీపీ ఉద్గారాల తీవ్రతను ఇప్పటికే సుమారు 36 శాతం తగ్గించిందనీ... 2030 నాటికి గల గడువు కంటే తొమ్మిది సంవత్సరాల ముందే పారిస్ ఒప్పంద లక్ష్యాలను నెరవేర్చిన మొదటి జీ20 దేశంగా అవతరించిందని డాక్టర్ మిశ్రా తెలిపారు. ఈ నేపథ్యంలోనే మనం భారత ఇంధన పరివర్తన వ్యూహాన్ని చూడాలని వ్యాఖ్యానించారు. ఇంధన వనరుల వైవిధ్యం డీకార్బనైజేషన్‌తో పాటు ఇంధన భద్రతకూ దోహదపడిందని డాక్టర్ మిశ్రా స్పష్టం చేశారు. సౌర విద్యుత్ లక్ష్యాన్ని 20 గిగావాట్ల నుంచి 100 గిగావాట్లకు పెంచడం, జాతీయ సౌర మిషన్‌ను వేగవంతం చేయడం, 2016లో జాతీయ టారిఫ్ విధానానికి సవరణలు, 2018లో జీవ ఇంధనాల జాతీయ విధానం... 2021 స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో ప్రధానమంత్రి ప్రకటించిన జాతీయ హైడ్రోజన్ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు... ఆర్థిక వ్యవస్థను డీకార్బనైజ్ చేయడం, దీర్ఘకాలిక శిలాజ ఇంధన దిగుమతులను తగ్గించే ఒక మార్గంగా గ్రీన్ హైడ్రోజన్ దిశగా మార్పును గురించి సంకేతమిచ్చాయి. ఇటీవల రూపొందించిన చట్టాల ద్వారా అణు ఇంధన రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అనుమతినిస్తూ భారత్ చరిత్రాత్మక సంస్కరణను చేపట్టిందని డాక్టర్ మిశ్రా స్పష్టం చేశారు. ఇది 2047 నాటికి అణు ఇంధన సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందనీ... స్థిరమైన, సున్నా కార్బన్ బేస్‌లోడ్ ఇంధనాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. ఇంధన భద్రత, దిగుమతుల తగ్గింపుతో ఇంధన పరివర్తనను నేరుగా ఈ చర్యలు సమలేఖనం చేస్తాయని... భారత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని పెంచుతాయని వివరించారు. పీఎమ్ కుసుమ్ విధాన సమ్మిళితత్వానికి ఉదాహరణగా నిలుస్తుందని తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయ పద్ధతులు, ఆర్థిక స్థిరత్వం, గ్రామీణాభివృద్ధిలు పరస్పరం బలోపేతం చేసుకునే విధంగా ఇంధన పరివర్తన వాటికి మద్దతునిస్తుంది. జీవ ఇంధనాల కార్యక్రమం ఈ గ్రామీణ పరివర్తనను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. పర్యావరణ హిత ఇంధనాల ప్రయోజనాలు నేరుగా గృహాలకు విస్తరిస్తాయని, ఇంధన వ్యవస్థలో వినియోగదారులను క్రియాశీల భాగస్వాములుగా, ఉత్పత్తిదారులుగా మారుస్తాయని డాక్టర్ మిశ్రా అన్నారు. భారత్ ఇప్పటికే సంపూర్ణ గృహ విద్యుదీకరణను సాధించిందని, పర్యావరణ హిత ఇంధన విస్తరణ సామాజిక సమగ్రతతో సమానంగా ఉండేలా చూసుకుందని ఆయన పేర్కొన్నారు. దీని ఆధారంగా 2024లో ప్రారంభించిన పీఎమ్ సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన... పర్యావరణ హిత ఇంధనాన్ని నేరుగా గృహాల పైకప్పులపైకి తెచ్చింది. భవన నిర్మాణ నిబంధనలు, సామర్థ్య ప్రమాణాలతో కలిసి, ఉజాలా ఎల్ఈడీ ప్రోగ్రామ్ వంటి కార్యక్రమాలు భారత్ తక్కువ–కార్బన్ అభివృద్ధి వ్యూహంలో ఇంధన సామర్థ్యాన్ని మూలస్తంభంగా చేస్తాయి. పర్యావరణం కోసం జీవనశైలి (లైఫ్) ఉద్యమాన్ని ప్రారంభించడం ఒక కీలక పరిణామమని డాక్టర్ మిశ్రా స్పష్టం చేశారు. ఇది సుస్థిరత దృక్కోణంలో సాంకేతికతతో పాటు మార్పు ప్రాముఖ్యాన్ని గుర్తించిందన్నారు. ఈ చర్యల ద్వారా భారత్ తన పారిస్ ఒప్పంద లక్ష్యాలను నిర్దేశిత సమయానికి చాలా ముందుగానే సాధించిన మొదటి జీ20 దేశంగా అవతరించిందని పేర్కొన్నారు. ప్రకటించిన గడువు కంటే ముందే 50 శాతం శిలాజేతర స్థాపిత విద్యుత్ ఉత్పాదక సామర్థ్యాన్నీ భారత్ అధిగమించిందని తెలిపారు. సోలార్ పీవీ మాడ్యూల్స్ కోసం ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకం (పీఎల్ఐ) పథకం గురించి డాక్టర్ మిశ్రా మాట్లాడుతూ, దేశీయ తయారీ దిశగా నిర్ణయాత్మక మార్పులో దాని ప్రాముఖ్యాన్ని స్పష్టం చేశారు. 2022 నుంచి, సోలార్ మాడ్యూల్ తయారీ సామర్థ్యం దాదాపు 120 గిగావాట్లకు విస్తరించి దాదాపు 82 గిగావాట్ల పెరుగుదలను నమోదు చేసిందన్నారు. అధునాతన బ్యాటరీ తయారీ, ఇతర పర్యావరణ హిత ఇంధన సప్లయి చెయిన్‌లకు మద్దతు ద్వారానే ఇది సాధ్యమైందని డాక్టర్ మిశ్రా పేర్కొన్నారు.

## కౌశిక్ రెడ్డి సారీ చెప్పు

**భగ్గుమన్న ఐపీఎస్, ఐఏఎస్, పోలీస్ సంఘాలు**

కరీంనగర్, జనవరి 30 (ఈవార్తలు): కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలంను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలను తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఐపీఎస్ అధికారుల సంఘం, ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించాయి. ఎమ్మెల్యే తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, కమిషనర్‌కు, ఇతర పోలీస్ అధికారులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. గురువారం హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తన స్వగ్రామమైన వీణవంకలో జరిగే సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. అయితే, జాతర వద్ద రద్దీని నియంత్రించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పెద్ద కాన్వాయ్‌లకు అనుమతి లేదని పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు హుజూరాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యే వర్గీయులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీసులు వారిని రోడ్డుపై నుంచి పక్కకు పంపించారు. ఆ తర్వాత వీణవంకలోని జాతర ప్రాంగణంలో సమ్మక్క గద్దె వద్ద కూడా కౌశిక్ రెడ్డి పోలీసులతో మరోసారి వాగ్వాదానికి దిగారు. గ్రామ సర్పంచ్‌ను కొబ్బరికాయ కొట్టనీయలేదని ఆయన ఆరోపించగా, పోలీసులు ఆ ఆరోపణలను ఖండించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని సైదాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, తర్వాత విడుదల చేశారు. ఈ ఘటనపై హుజూరాబాద్ పోలీసులు శుక్రవారం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులను దూషించి, ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్న పోలీసు అధికారులపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి ఎదుల తీవ్రంగా ఖండించారు. "ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా గుంపుగా వెళ్లడమే కాకుండా, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించే ప్రయత్నం చేయడం దారుణం. అక్కడ లేని సీపీ మతాన్ని ప్రస్తావిస్తూ మాట్లాడటం అత్యంత హేయమైన చర్య" అని ఆయన మండిపడ్డారు. పాడి కౌశిక్‌రెడ్డిపై తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్‌పై ఆయన చేసిన మతపరమైన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, అధికారి మతాన్ని ప్రస్తావించడం హేయమైన చర్య అని ఐపీఎస్ సంఘం పేర్కొంది. నిబద్ధతతో పనిచేసే అధికారులపై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం పౌర సేవల గౌరవానికి భంగం కలిగించడమేనని, ఎమ్మెల్యేపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఐఏఎస్ అధికారుల సంఘం కూడా కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను "పరువు నష్టం కలిగించేవి, మతపరమైనవి"గా అభివర్ణించింది. "అధికారులు చట్టాన్ని అమలు చేస్తుంటే, శాసనసభ్యుడు మతపరమైన గుర్తింపు ఆధారంగా వ్యక్తిగత దాడికి దిగడం విచారకరం. ఇది లౌకిక స్ఫూర్తిపై, పోలీసు వ్యవస్థ స్వయంప్రతిపత్తిపై జరిగిన దాడి. ఎమ్మెల్యే తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలి. శాసనసభాపతి కూడా ఈ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి" అని ఐఏఎస్ సంఘం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. దీంతో కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్తూ ఒక వీడియో రిలీజ్ చేశారు. ఈ అంశాన్ని ఇంతటితో వదిలేయాని కోరారు.

**పోలీసు అధికారులపై పాడి ప్రివిలేజ్ మోషన్**

వీణవంక మండలంలో జరిగిన మినీ మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరలో తనను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం శాసనసభ స్పీకర్‌కు ఆయన ప్రివిలేజ్ మోషన్ (సభా హక్కుల ఉల్లంఘన నోటీసు) అందజేశారు. జాతరలో ప్రజలతో కలిసి ఆదివాసీ దేవతలను దర్శించుకుంటున్న సమయంలో, కరీంనగర్ జిల్లా సీపీ, హుజురాబాద్ ఏసీపీ, జమ్మికుంట రూరల్ సీఐ తనను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు.

# కక్ష సాధింపునకే కేసీఆర్‌కు నోటీసులు



**సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత నవీన్ పటేల్ ధ్వజం**

జూబ్లీహిల్స్/యూసుఫ్‌గూడ, జనవరి 30 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసఫ్ గూడకు చెందిన పోగుల నవీన్ కుమార్ పటేల్ తీవ్రంగా ఖండించారు. ఎలాంటి స్పష్టమైన ఆధారాలు, సాక్ష్యాలు లేకుండానే కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం కక్షసాగింపులో భాగమేనని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి, రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిపై ఈ తరహా చర్యలకు దిగడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని అన్నారు. పదేళ్లపాటు సాగునీటి ప్రాజెక్టులు, రైతుబంధు, మిషన్ భగీరథ వంటి ఎన్నో పథకాలతో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఆ ప్రజా వ్యతిరేకత నుంచి దృష్టి మరల్చేందుకే నోటీసుల నాటకం ఆడుతోందని విమర్శించారు. ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడిని వేధించడం ద్వారా బీఆర్ఎస్ శ్రేణులను భయపెట్టలేరని స్పష్టం చేశారు.




# మహిళా సాధికారతతోనే తెలంగాణ ప్రగతి

**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్**

హైదరాబాద్, జనవరి 30 (ఈవార్తలు): పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో పోటీపడి సాధికారత సాధించిన మహిళలే తెలంగాణ ప్రగతికి పునాది అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ప్రముఖ సౌందర్య నిపుణురాలు రమణి పెనుబాల ఏర్పాటు చేసిన మీయోరీ సెలూన్ అండ్ అకాడమీని శుక్రవారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలకు ఉజ్వలమైన మరియు సమానమైన భవిష్యత్తు అందించేందుకు, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే పలు ప్రభావవంతమైన విధానాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం దృఢంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. అకాడమీ నిర్వాహకురాలు రమణి పెనుబాలను అభినందించిన ఎమ్మెల్యే, ఈ సంస్థ ద్వారా యువతికి నాణ్యమైన శిక్షణ అందించి వారికి ఉత్తమ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. రమణి పెనుబాల మాట్లాడుతూ, చర్మ సంరక్షణ, మేకప్ అప్లికేషన్, హెయిర్ స్టైలింగ్, నెయిల్ కేర్, వాక్సింగ్, హెయిర్ అండ్ ఫేస్ ట్రీట్మెంట్స్ వంటి కోర్సుల్లో అనుభవజ్ఞులైన బోధకుల పర్యవేక్షణలో ఆచరణాత్మక శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ శిక్షణ ద్వారా యువతీయువకులు విజయవంతమైన కెరీర్‌ను ప్రారంభించేందుకు మార్గదర్శనం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వృద్ధి విశ్లేషకులు వేణు కళ్యాణ్, ప్రముఖ సంఘసేవకులు భాను కిరణ్ పసుల, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధ్య రెడ్డి, టీడీపీ ప్రధాన కార్యదర్శి ఏ. విశ్వం తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో చంద్రబాబు భూదోపిడీ

**వైసీపీ నేత బొత్స సత్యనారాయణ ఆరోపణలు**

వైజాగ్, జనవరి 30 (ఈవార్తలు): విశాఖలోని గీతం యూనివర్సిటీ భూములపై వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. జీవీఎంసీ ధర్నాచౌక్ వద్ద శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. గీతం యూనివర్సిటీ భూదోపిడీని అరికట్టాలని ఈ సందర్భంగా వైసీపీ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, కన్నబాబు తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ... చంద్రబాబు, ఆయన కుటుంబం విశాఖలో భూదోపిడీకి తెరలేపిందని అన్నారు. అధికారం ఉందని భూదోపిడీ చేస్తే పేద కుటుంబాల తరపున తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక పనులను తాము ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని అన్నారు. ప్రజల ఆస్తులను కాపాడటమే లక్ష్యంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

# లడ్డూ వివాదంపై చంద్రబాబు క్లారిటీ ఇవ్వాలి: సజ్జల



తాడేపల్లి, జనవరి 30 (ఈవార్తలు): తిరుపతి లడ్డూలో జంతు కొవ్వు కలిపారంటూ చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత ఇవ్వాలని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. తమ పార్టీ హయాంలో లడ్డూలో జంతు కొవ్వు వాడారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదా ల్యాబ్ నివేదికల నేపథ్యంలో ఒక నిర్దిష్ట ప్రకటన చేయాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తిరుపతి లడ్డూలో ఎలాంటి జంతు కొవ్వు లేదని ల్యాబ్ నివేదికలు స్పష్టంగా తేల్చి చెప్పాయని సజ్జల అన్నారు. ఈ అంశంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని, దీనిని తీవ్రంగా పరిగణించాలని అన్నారు. ముఖ్యమంత్రి వంటి ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి, ఇంత బాధ్యతారహితమైన ప్రకటన చేసినందుకు ఆయనను నిలదీయాలని పేర్కొన్నారు. రెండు జాతీయ ప్రయోగశాలల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా సిట్ ఇచ్చిన రిపోర్ట్‌లో లడ్డూలో జంతు కొవ్వు లేదని తేలిందని, అయినా ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి చంద్రబాబు ప్రయత్నించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో అప్పటి టీటీడీ చైర్మన్ లేదా బోర్డు సభ్యుల ప్రమేయం ఉన్నట్లు సిట్ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదని సజ్జల గుర్తుచేశారు. ఇది తమకు క్లీన్‌చిట్ లాంటిదని, ఈ ఆరోపణలు న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటాయని తెలిపారు. వాస్తవాలు అంగీకరించకుండా, చంద్రబాబు, ఆయన ప్రచార యంత్రాంగం ఇప్పటికీ తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి 2019-24 మధ్య కాలంలోనే అవకతవకలు జరిగాయని నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు వ్యాఖ్యల వల్లే ఈ మొత్తం విచారణ మొదలైందని, భక్తుల మనోభావాలు దెబ్బతిన్నందున ఆయన దీనిపై కచ్చితంగా వివరణ ఇవ్వాలని సజ్జల అన్నారు. "నెయ్యి సేకరణకు సంబంధించి ఇప్పటికే ఒక పటిష్టమైన వ్యవస్థ ఉంది. మేము దానిని మరింత మెరుగుపరిచాం. నాణ్యతా నియంత్రణ చర్యలను కఠినతరం చేసి, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను తిరస్కరించాం. వ్యవస్థలో ఆధునికతను తీసుకొచ్చాం. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేవలం 2019-24 కాలాన్ని, కొన్ని లావాదేవీలను మాత్రమే ఎంచుకుని విమర్శించడం వారి రాజకీయ దురుద్దేశాన్ని స్పష్టం చేస్తోంది. ఆ కంపెనీలు, కాంట్రాక్టర్లు అంతకు ముందు నుంచే ఉన్నారు. పేర్లు మారినా, సరఫరాదారులు వారే" అని సజ్జల వివరించారు.

# వేములవాడ మహా శివరాత్రి జాతర పోస్టర్ ఆవిష్కరణ

**సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు ఆహ్వాన పత్రిక అందజేత**

సిరిసిల్ల/వేములవాడ, జనవరి 30 (ఈవార్తలు): ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. ఈ నెల 14వ తేదీ నుంచి వేములవాడలో నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, ఆలయ ఈవో రమాదేవి, అధికారులు, అర్చకులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈఓ, అర్చకులు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా గరిమ మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు వేములవాడలో మహా శివరాత్రి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. 15 వ తేదీన మహా శివరాత్రి జాతర నిర్వహించనున్నామని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై అధికారులను ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, మైపాల్ రెడ్డి, ఆలయ ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్, అశోక్, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# మల్యాల సమస్యలు తీర్చండి

**కలెక్టర్‌కు సర్పంచ్ వినతులు**

మల్యాల/జగిత్యాల, జనవరి 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోనే అతిపెద్ద గ్రామపంచాయతీ అని మల్యాలలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయని, ముఖ్యంగా కోతులు, వీధికుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని సర్పంచ్ బొట్ల జయ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆమె ఆధ్వర్యంలోని పాలకవర్గం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి సమస్యలను వివరించారు. కోతులు, వీధికుక్కల బెడదను తప్పించేందుకు అధికారయంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ చెప్పినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.



# తోపుడు బండ్లను రోడ్డుపై నిలపొద్దు

**విక్రయదారులకు ఉపసర్పంచ్ వినయ్ వినతి**

మల్యాల, జనవరి 30 (ఈవార్తలు): మల్యాలలో ప్రతి శుక్రవారం జరిగే అంగడిలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఉపసర్పంచ్ వినయ్ విక్రయదారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన వారసంతను పరిశీలించి విక్రయదారులకు పలు సూచనలు చేశారు. తోపుడుబండ్లను రోడ్డుపై నిలిపి అమ్మకాలు చేపట్టరాదని, లౌడ్ స్పీకర్లు ఉపయోగించవద్దన్నారు. అలాగే, ఫోర్ వీలర్స్ వాహనదారులు వారసంత జరిగే దారిలో కాకుండా, మరో దారిలో వెళ్లాలని సూచించారు.

# 32 మంది విద్యార్థులకు అస్వస్థత

**వికటించిన మధ్యాహ్న భోజనం.. ఖమ్మం జిల్లాలో కలకలం**

ఖమ్మం, జనవరి 30 (ఈవార్తలు): ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం భోజ్యతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం పాఠశాలలో వడ్డించిన మధ్యాహ్న భోజనం తిన్న కొద్దిసేపటికే విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. సుమారు 32 మంది విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరు వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడటంతో పాఠశాల ప్రాంగణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. విద్యార్థుల పరిస్థితిని గమనించిన ఉపాధ్యాయులు వెంటనే అప్రమత్తమై సహాయక చర్యలు ప్రారంభించారు. పరిస్థితి విషమిస్తుండటంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (హెచ్ఎం) తక్షణమే స్పందించి, అస్వస్థతకు గురైన విద్యార్థులందరినీ చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం విద్యార్థులకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నప్పటికీ, తమ పిల్లల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి వద్దకు చేరుకున్న బాధితుల కుటుంబ సభ్యుల రోదనలతో అక్కడి వాతావరణం అత్యంత విషాదకరంగా మారింది. ఈ ఘటనపై స్థానిక ప్రజలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని, పర్యవేక్షణ లోపం వల్లే తమ పిల్లల ప్రాణాల మీదకు వచ్చిందని వారు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. భోజన తయారీలో వాడిన పదార్థాల నాణ్యతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి ఇప్పటికే విచారణకు ఆదేశించింది. భోజనంలో ఏదైనా విషపూరిత పదార్థాలు కలిసాయా లేదా కలుషిత నీటి వల్ల ఈ పరిస్థితి తలెత్తిందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణ నివేదిక ఆధారంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు హామీ ఇచ్చారు.



# పదేళ్లలో హైదరాబాద్‌ను మించి అమరావతి

**ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి**

అమరావతి, జనవరి 30 (ఈవార్తలు): ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గడ్డను మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన 'కానూరి-జింఖానా' మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రం నిర్మాణం కోసం గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు ఏకంగా రూ.100 కోట్లు విరాళంగా సమకూర్చగా, ప్రభుత్వం పరికరాలు, ఫర్నిచర్ కోసం మరో రూ.27 కోట్లు వెచ్చించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు కేటాయించినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిది. సమాజంలో ఇంకా మంచితనం మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా దశాబ్దాల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు జన్మభూమిని మరచిపోతారు. కానీ మీరు చదువుకున్న కళాశాలను గుర్తుపెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేయడం అభినందనీయం. భవన నిర్మాణంతో పాటు, భవిష్యత్తులో దాని నిర్వహణకు ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం మీ ముందుచూపునకు నిదర్శనం" అని ప్రశంసించారు. రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించే లక్ష్యంతోనే తాను 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై గెలుపు) కార్యక్రమాన్ని తీసుకొచ్చానని ముఖ్యమంత్రి వివరించారు. "కేంద్ర ప్రభుత్వం రహదారులు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కోసం పీ4 మోడల్‌ను ప్రోత్సహిస్తోంది. కానీ నేను పేదల అభ్యున్నతి కోసం పీ4ను అమలు చేస్తున్నాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు తగ్గుతాయి. చదువు అనేది ఒక గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఆర్థిక సాయంతోనే ఉన్నత స్థాయికి చేరారు. పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 10.42 లక్షల మందిని లక్షా 2 వేల మంది దాతలు దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై పేదలకు అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. రానున్న పదేళ్లలో గుంటూరు, అమరావతి ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు రానుంది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలన్నది నా లక్ష్యం. ఒకప్పుడు సైబరాబాద్ నిర్మించాం, ఇప్పుడు అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ'కి శ్రీకారం చుడుతున్నాం.

# రాజకీయ సిఫార్సులు చేయను

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



అమరావతి, జనవరి 30 (ఈవార్తలు): 'నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు గానీ, సిఫార్సులు గానీ ఉండవు. కష్టపడి పనిచేసే అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు... ప్రతి అధికారి నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయాలి' అని ఏపీ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. పనిలో అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం సహించేది లేదని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైనా కఠినంగా వ్యవహరిస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కొంతమంది అధికారులు ఇంకా పాత నాయకులతో సంబంధాలు కొనసాగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ పాలసీల అమలులో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ప్రజల సంతోషం, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు చిత్తశుద్ధితో, జవాబుదారీతనంతో వ్యవహరించాలని పవన్ కల్యాణ్ కోరారు. శుక్రవారం నాడు విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం, పల్లెపండగ 1.0, 2.0, జల్ జీవన్ మిషన్ వంటి పథకాల పురోగతిపై ఆరా తీశారు. లక్ష్యాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారనే దానిపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో ఉంది. నాకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదు. పని మాత్రమే కావాలి. ఉన్నత స్థాయి అధికారి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలి" అని అన్నారు. గత ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీల్లో స్వపరిపాలనకు చోటు లేకుండా చేసి, ఆర్థిక క్రమశిక్షణ లేకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను నీరుగార్చి, రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. పనులు చేసినట్టు రికార్డులు సృష్టించారు గానీ, ఒక్క ఇంటికి కూడా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు" అని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ, వ్యవస్థలను బలోపేతం చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దేందుకు సంస్కరణలు అమలు చేస్తున్నామని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న 10 వేల ప్రమోషన్లను ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా పూర్తి చేసి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని పవన్ గుర్తుచేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ఓ ఎంపీడీవోపై దాడి జరిగితే స్వయంగా వెళ్లి భరోసా ఇచ్చామని, ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కష్టపడుతున్నామని, కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని, తమ కష్టానికి సార్థకత చేకూరేలా అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, విశాఖపట్నం కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున, వివిధ శాఖల రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.




# 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్**

అమరావతి, జనవరి 30 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం, సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు. ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు నాలుగు వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం పొందడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.





# అణ్వస్త్ర నిల్వల్లో భారత్ ముందంజ

## పాకిస్థాన్‌ను అధిగమించిన ఇండియా

### భారత్ వద్ద 180, పాకిస్థాన్ వద్ద 170 అణు వార్‌హెడ్స్

**ప్రపంచవ్యాప్తంగా అణ్వస్త్ర పోటీ కొత్త ఆందోళనలకు తెరలేపుతున్న తరుణంలో, దక్షిణాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అణు వార్‌హెడ్‌ల సమీకరణలో భారత్ తన పొరుగు దేశం పాకిస్థాన్‌ను అధిగమించింది. అంతర్జాతీయ నివేదికల ప్రకారం, భారత్ తన అణు సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటుండగా, మరోవైపు అగ్రరాజ్యాల మధ్య ఉన్న కీలక అణు నియంత్రణ ఒప్పందం ముగింపు దశకు రావడం ప్రపంచ భద్రతపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది.**

న్యూఢిల్లీ: ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ తాజా అంచనాల ప్రకారం, 2025 నాటికి భారత్ వద్ద అణు వార్‌హెడ్‌ల సంఖ్య 180కి చేరింది. గతేడాది ఈ సంఖ్య 172గా ఉండగా, తాజాగా మరో 8 వార్‌హెడ్‌లను సమకూర్చుకుంది. అదే సమయంలో పాకిస్థాన్ వద్ద అణ్వస్త్రాల సంఖ్య 170 వద్దే స్థిరంగా ఉంది. అణ్వస్త్రాల విషయంలో రష్యా (4,309), అమెరికా (3,700) అగ్రస్థానంలో కొనసాగుతుండగా, చైనా వద్ద 600 వార్‌హెడ్‌లు ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఇజ్రాయెల్, ఉత్తర కొరియా కూడా అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన దేశాల జాబితాలో ఉన్నాయి. పాకిస్థాన్‌తో పాటు ముఖ్యంగా చైనా నుంచి ఎదురవుతున్న భద్రతాపరమైన సవాళ్లే భారత్ తన అణు సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. చైనాలోని సుదూర ప్రాంతాలను సైతం లక్ష్యంగా చేసుకోగల దీర్ఘశ్రేణి క్షిపణులపై భారత్ దృష్టి సారించింది. ఒకే క్షిపణితో బహుళ లక్ష్యాలను ఛేదించగల 'మల్టిపుల్ ఇండిపెండెంట్‌లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికల్స్' టెక్నాలజీని కూడా అభివృద్ధి చేస్తోంది. మరోవైపు, సంప్రదాయ సైనిక శక్తిలో తనకంటే పెద్దదైన భారత్‌ను నిలువరించడమే లక్ష్యంగా పాకిస్థాన్ తన అణు కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. భారత్ 'మొదటగా అణుదాడి చేయబోమనే' విధానానికి కట్టుబడి ఉన్నట్లు చెబుతున్నా, 2019లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఈ విధానంపై కొంత అనిశ్చితిని సృష్టించాయి. అయితే, పాకిస్థాన్ మాత్రం ఇలాంటి విధానాన్ని అధికారికంగా ప్రకటించలేదు. గత ఏడాది మే నెలలో ఇరు దేశాల మధ్య 88 గంటల పాటు కొనసాగిన ఉద్రిక్తతలు, అణు దేశాల మధ్య చిన్నపాటి ఘర్షణలు కూడా ఎంతటి పెను ప్రమాదానికి దారితీయగలవో గుర్తుచేశాయి. ఈ పరిణామాలు జరుగుతున్న తరుణంలోనే, అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాల మధ్య ఉన్న 'న్యూ స్టార్ట్' అణు ఒప్పందం వచ్చే వారం ఫిబ్రవరి 4తో ముగియనుంది. దీనికి ప్రత్యామ్నాయ ఒప్పందం కుదరకపోవడంతో, గత 50 ఏళ్లలో ఇరు దేశాల మధ్య అణ్వాయుధాలపై ఎలాంటి పరిమితులు లేని పరిస్థితి ఏర్పడటం ఇదే తొలిసారి కానుంది. ఇది




ప్రపంచవ్యాప్తంగా కొత్త అణ్వస్త్ర పోటీకి దారితీయవచ్చని, ఇరు పక్షాల వ్యూహాత్మక ప్రణాళికలు "అనిశ్చితి, తీవ్ర పరిణామాల అంచనాల" ఆధారంగా నడిచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు అమెరికా తన అణ్వస్త్రాలను తగ్గిస్తుండగా, ఇప్పుడు రష్యా, చైనా, భారత్, పాకిస్థాన్, యూకే వంటి దేశాలు తమ నిల్వలను పెంచుకోవడం ప్రపంచ భద్రతకు కొత్త సవాలుగా మారింది.

# జెలెన్‌స్కీకి రష్యా ఆహ్వానం

## చర్చల కోసం మాస్కో రావాలని పిలుపు.. దాడులు ఆపాలని పుతిన్‌కు ట్రంప్ విజ్ఞప్తి

మాస్కో: దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అంతర్జాతీయ వేదికలపై దౌత్య ప్రయత్నాలు తుది దశకు చేరుకున్నాయి. రష్యా ప్రభుత్వం మరోసారి ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీని శాంతి చర్చల కోసం మాస్కో రావాల్సిందిగా ఆహ్వానించింది. ఈ మేరకు క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే, జెలెన్‌స్కీ గతంలోనే ఇలాంటి ఆహ్వానాన్ని తిరస్కరించారు. ప్రతిరోజూ క్షిపణి దాడులు చేస్తున్న దేశ రాజధానికి తాను వెళ్లలేనని, చర్చలు జరగాలంటే పుతిన్ 'కీవ్'కు రావాలని డిమాండ్ చేశారు. తాజా ఆహ్వానంపైనా అలాగే స్పందించారు. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధాన్ని ముగించడమే లక్ష్యంగా చేపట్టిన దౌత్యవేత్తల చర్చలు అబుదాబిలో సాగుతున్నాయి. గత వారాంతంలో జరిగిన మొదటి రౌండ్ చర్చలు 'నిర్మాణాత్మకంగా' సాగాయని, ఫిబ్రవరి 1వ తేదీన రెండో రౌండ్ చర్చలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. "చాలా మంచి పరిణామాలు జరుగుతున్నాయి" అని ఈ చర్చల పురోగతిపై ట్రంప్ స్వయంగా ట్వీట్ చేయడం విశేషం. ఉక్రెయిన్‌లో ప్రస్తుతం మైనస్ డిగ్రీల చలి తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో లక్షలాది మంది ప్రజలు అంధకారంలో మగ్గిపోవడంతో, మానవతా దృక్పథంతో విద్యుత్ గ్రిడ్లపై దాడులు ఆపాలని ట్రంప్ చేసిన విజ్ఞప్తికి రష్యా సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. దీనిపై రష్యా నేరుగా స్పందించనప్పటికీ, వారం రోజుల పాటు 'హ్యుమానిటేరియన్ పాజ్' (మానవతా విరామం) ఇచ్చే అవకాశం ఉందని వైట్ హౌస్ వర్గాలు వెల్లడించాయి.





# నిజాం నగలు భద్రమే: కేంద్రం

న్యూఢిల్లీ: నిజాం నవాబులకు చెందిన అపురూప ఆభరణాలపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ నగలు ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆధీనంలో అత్యంత భద్రంగా ఉన్నాయని, అయితే వాటిని శాశ్వత ప్రదర్శన కోసం హైదరాబాద్‌కు తరలించే విషయంపై ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నిన్న రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 1995 నుంచి 173 అపురూపమైన నిజాం ఆభరణాలు ఆర్‌బీఐ లాకర్లలో ఉన్నాయన్న విషయం ప్రభుత్వానికి తెలుసా? అని అడగగా, మంత్రి 'అవును' అని బదులిచ్చారు. ఈ నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందా అని, వాటిని సొంత గడ్డ అయిన హైదరాబాద్‌లో ప్రదర్శించాలన్న ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటుందా అని కూడా ప్రశ్నించారు. దీనికి మంత్రి బదులిస్తూ, నిజాం నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను, వాటితో ముడిపడి ఉన్న ప్రజా ప్రయోజనాలను తమ మంత్రిత్వ శాఖ గుర్తిస్తుందని తెలిపారు. అయితే, ఆర్‌బీఐతో ఉన్న ఒప్పందం ప్రకారం భద్రతా కారణాల రీత్యా ఈ ఆభరణాలు అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్నాయని షెకావత్ వివరించారు. ఈ నేపథ్యంలో వాటిని శాశ్వత ప్రదర్శన కోసం హైదరాబాద్‌కు తరలించే అంశంపై ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

# సోషల్ మీడియా ఖాతాకూ పర్మిషన్

### ప్రభుత్వ ఉద్యోగులకు బీహార్ సర్కారు ఆదేశాలు

పాట్నా: సోషల్ మీడియా వాడే ప్రభుత్వ ఉద్యోగులకు బీహార్ ప్రభుత్వం ఊహించని షాకిచ్చింది. ఫేస్ బుక్, ఎక్స్, ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా అకౌంట్లు ఓపెన్ చేయాలంటే ఇకపై పర్మిషన్ తీసుకోవాలని తెలిపింది. ఉద్యోగులను సోషల్ మీడియా వాడకుండా నిషేధించడం దీని ఉద్దేశ్యం కాదని, వారు హుందాగా నడుచుకునేలా చూడటమే ముఖ్య ఉద్దేశ్యమని వివరించింది. ఉద్యోగులు సోషల్ మీడియా వాడటంపై కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఏ ఉద్యోగి అయిన సోషల్ మీడియాలో అకౌంట్ ఓపెన్ చేయాలంటే సంబంధిత శాఖకు చెందిన అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే. అలాగే నకిలీ ఖాతాలను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. ఉద్యోగుల హోదా, ప్రభుత్వ లోగోలతో ఎలాంటి పోస్టులూ చేయకూడదు. పర్సనల్ సోషల్ మీడియా అంకౌట్లకు గవర్నమెంట్ కు చెందిన ఈమెయిల్ ఐడీలు, ఫోన్ నంబర్లు వాడకూడదు. అశ్లీలత, కుల, మతాలపై చేసే పోస్టులు పూర్తిగా నిషేధం. అధికారిక సమావేశాలు, వీడియోలు, ఫొటోలను కూడా సోషల్ మీడియాలో పోస్టు చేయకూడదు. ఉద్యోగులు ఎలాంటి కంటెంట్ షేర్ చేయవచ్చన్నదానిపై పూర్తి స్పష్టతతో మార్గదర్శకాలు రూపొందించినట్లు బిహార్ ప్రభుత్వం తెలిపింది.

# మైనర్లకు సోషల్ మీడియా బ్యాన్!

### కట్టడి ఆలోచనలో కర్ణాటక సర్కారు



బెంగళూరు: పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించే అంశంపై కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా చర్చిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, బీటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే తెలిపారు. దీనివల్ల ఎదురయ్యే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు శుక్రవారం శాసనసభలో ఆయన వెల్లడించారు. బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే ఎస్. సురేశ్ కుమార్ ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేయగా, మంత్రి స్పందించారు. ఈ విషయం చాలా తీవ్రమైనదని, ఇప్పటికే ఫిన్‌లాండ్, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాలు పిల్లల సోషల్ మీడియా వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయని ప్రియాంక్ ఖర్గే గుర్తుచేశారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించాలనే దానిపై మేం చర్చిస్తున్నాం. ఈ అంశం ప్రస్తుతం పరిశీలనలో ఉంది" అని ఆయన తెలిపారు. ఇప్పటికే మెటా సంస్థ సహకారంతో రాష్ట్రంలో 'డిజిటల్ డిటాక్స్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో దాదాపు 3 లక్షల మంది విద్యార్థులు, లక్ష మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని వివరించారు. అంతకుముందు సభలో మాట్లాడిన సురేశ్ కుమార్, 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను ఆస్ట్రేలియా నిషేధించిందని ప్రస్తావించారు. "పిల్లలు యుక్తవయస్కులు కాకముందే అశ్లీల కంటెంట్‌కు బానిసలవుతున్నారు. ఇది చాలా ప్రమాదకరం. వెంటనే చర్యలు తీసుకోకపోతే మన పాఠశాలలు, కుటుంబ వ్యవస్థలు నాశనమవుతాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఐటీ సోదాలు జరుగుతుండగా రియల్టర్ సూసైడ్

### కాన్ఫిడెంట్ గ్రూప్ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త సీజే రాయ్ ఆత్మహత్య

**ఆదాయపన్ను శాఖ సోదాల నేపథ్యంలో కార్యాలయంలోనే ఘటన**

బెంగళూరు: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కాన్ఫిడెంట్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ సీజే రాయ్ (57) ఆత్మహత్య చేసుకున్నారు. బెంగళూరులోని తన కార్యాలయంలో శుక్రవారం తుపాకితో కాల్చుకుని ఆయన ప్రాణాలు విడిచారు. ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు ఆయన సంస్థలపై సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకోవడం వ్యాపార వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. గత రెండు, మూడు రోజులుగా కాన్ఫిడెంట్ గ్రూప్‌కు సంబంధించిన పలు ప్రాంగణాల్లో ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ వరుస దాడులతో సీజే రాయ్ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం లాంగ్‌ఫోర్డ్ రోడ్‌లోని తన ఆఫీసులో తలపై తుపాకితో కాల్చుకున్నారు. సిబ్బంది వెంటనే ఆయన్ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. "కాన్ఫిడెంట్ గ్రూప్ చైర్మన్ తనను తాను కాల్చుకున్నారు. ఆసుపత్రికి తరలించగా, మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. గత 2-3 రోజులుగా ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఆయన కుటుంబ సభ్యులు విదేశాల్లో ఉన్నారు, వారికి సమాచారం అందించాం" అని తెలిపారు. కేరళలోని కొచ్చికి చెందిన సీజే రాయ్, కాన్ఫిడెంట్ గ్రూప్‌ను స్థాపించి దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా కర్ణాటక, కేరళలో అనేక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టారు. వ్యాపారవేత్తగానే కాకుండా, ఆయన మలయాళంలో సినీ నిర్మాతగానూ సుపరిచితులు. మోహన్‌లాల్ హీరోగా నటించిన 'కాసనోవా' చిత్రాన్ని నిర్మించారు. అశోక్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టమ్ అనంతరం మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.

# ఎన్ఎస్ఈ ఐపీఓకు సెబీ గ్రీన్ సిగ్నల్

ముంబై: భారత క్యాపిటల్ మార్కెట్లలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశంలోని అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ అయిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తన ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ కోసం మార్కెట్ నియంత్రణ సంస్థ (సెబీ) నుంచి ఆమోదం పొందినట్లు శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. దశాబ్దానికి పైగా నిరీక్షణకు ఈ ప్రకటనతో తెరపడింది. పాలనాపరమైన లోపాలు, తీవ్ర వివాదాస్పదమైన కో-లొకేషన్ కేసు వంటి పలు కారణాలతో ఎన్ఎస్ఈ ఐపీఓ ప్రణాళికలు ఏళ్లుగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాజాగా సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంతో, ఐపీఓ స్వరూపం, సమయంపై తుది నిర్ణయం తీసుకునేందుకు ఎన్ఎస్ఈ యాజమాన్యం సిద్ధమవుతోంది. నివేదికల ప్రకారం, ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఐపీఓ కోసం అవసరమైన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను సెబీకి సమర్పించాలని ఎన్ఎస్ఈ భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు, న్యాయ సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. డ్రాఫ్ట్ పత్రాలకు సెబీ నుంచి తుది ఆమోదం లభించిన తర్వాతే ఐపీఓ ప్రక్రియ ముందుకు సాగుతుంది. ఈ కీలక పరిణామంపై ఎన్ఎస్ఈ చైర్‌పర్సన్ శ్రీనివాస్ ఇంజెటి హర్షం వ్యక్తం చేశారు. "మా వృద్ధి ప్రయాణంలో ఇదొక ముఖ్యమైన మైలురాయి. సెబీ ఆమోదం లభించడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. దీనితో మా వాటాదారులందరికీ విలువను సృష్టించే ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నాం. భారత ఆర్థిక వ్యవస్థలో ఎన్ఎస్ఈ ఒక విడదీయరాని భాగమని, దేశ క్యాపిటల్ మార్కెట్లకు ఒక దిక్సూచి అనే విశ్వాసాన్ని ఈ ఆమోదం మరింత బలపరుస్తుంది" అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ఎన్ఎస్ఈ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఆశిష్‌కుమార్ చౌహాన్ తన కుటుంబంతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఎక్స్ఛేంజ్, దాని సభ్యులు, వాటాదారులు, దేశ శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా, ఎన్ఎస్ఈ ఐపీఓకు ఈ నెలలోనే ఆమోదం లభించే అవకాశం ఉందని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే గతంలోనే సంకేతాలు ఇచ్చారు. భారత్‌లో అత్యధికంగా వాటాలు కలిగిన అన్‌లిస్టెడ్ కంపెనీగా ఎన్ఎస్ఈకి పేరుంది. ఈ నేపథ్యంలో, ఈ ఐపీఓ భారత క్యాపిటల్ మార్కెట్ల చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన పబ్లిక్ ఇష్యూలలో ఒకటిగా నిలుస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఓలా ఎలక్ట్రిక్‌లో 5% ఉద్యోగాల కోత

### నిర్మాణాత్మక మార్పులే కారణమంటున్న కంపెనీ

న్యూఢిల్లీ: ప్రముఖ ఎలక్ట్రిక్ టూవీలర్ల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో సుమారు 5 శాతం మందిని తొలగిస్తున్నట్లు శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. కంపెనీలో జరుగుతున్న నిర్మాణాత్మక మార్పులు, కార్యకలాపాల్లో ఆటోమేషన్‌ను పెంచడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. భారత ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన మార్కెట్లో ఓలా తన ఆధిపత్యాన్ని కోల్పోతున్న తరుణంలో ఈ తొలగింపుల నిర్ణయం వెలువడటం గమనార్హం. 2024లో 36.7 శాతంగా ఉన్న కంపెనీ మార్కెట్ వాటా, 2025 నాటికి అనూహ్యంగా 16.1 శాతానికి పడిపోయింది. ఇదే సమయంలో సంప్రదాయ ఆటో కంపెనీలు ఎలక్ట్రిక్ వాహన విభాగంలో తమ స్థానాన్ని పటిష్టం చేసుకున్నాయి. ఆర్థికంగానూ ఓలా ఎలక్ట్రిక్ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (క్యూ2 ఎఫ్‌వై26) కంపెనీ రూ.418 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం కూడా గతేడాదితో పోలిస్తే 43 శాతం తగ్గి రూ.690 కోట్లకు పరిమితమైంది. సర్వీస్ ఆలస్యం కావడం, డెలివరీల్లో జాప్యం వంటి అంశాలపై కస్టమర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడం కూడా కంపెనీకి సవాలుగా మారింది. అయితే, కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచడం, దీర్ఘకాలిక లాభదాయకత కోసం సంస్థను పునర్వ్యవస్థీకరించడంపై దృష్టి సారించామని ఓలా తెలిపింది. దేశవ్యాప్తంగా 80 శాతానికి పైగా సర్వీస్ అభ్యర్థనలను ఒకే రోజులో పరిష్కరిస్తున్నట్లు పేర్కొంది. తీవ్రమైన పోటీ ఉన్న మార్కెట్లో లాభాలు, నగదు నిల్వలపై దృష్టి కేంద్రీకరించినట్లు కంపెనీ తెలిపింది. శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి ఓలా ఎలక్ట్రిక్ షేరు ధర రూ.32.3 వద్ద స్థిరపడింది.


# నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబై: కేంద్ర బడ్జెట్ 2026 సమీపిస్తున్న వేళ ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ముఖ్యంగా మెటల్ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 269 పాయింట్లు నష్టపోయి 82,269 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98 పాయింట్లు క్షీణించి 25,320 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లలో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.17 శాతం స్వల్పంగా నష్టపోగా, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.32 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ ఏకంగా 5.34 శాతం కుప్పకూలింది. ప్రపంచ వృద్ధి ఆందోళనలు, అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడంతో ఐటీ రంగం కూడా 1.02 శాతం నష్టపోయింది. అయితే, నిఫ్టీ మీడియా 2.07 శాతం, ఎఫ్ఎంసీజీ 1.41 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.09 శాతం చొప్పున లాభపడ్డాయి. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గడంతో డాలర్‌తో రూపాయి మారకం విలువ 15 పైసలు బలపడి 91.92 వద్ద ట్రేడ్ అయింది. బ్యాంక్ నిఫ్టీ సానుకూల సంకేతాలు ఇస్తోందని, స్వల్పకాలిక మూవింగ్ యావరేజ్‌లపైన కదలాడుతోందని విశ్లేషకులు తెలిపారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వృద్ధికి మద్దతు, ద్రవ్య క్రమశిక్షణ వంటి అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. బడ్జెట్ కారణంగా ఫిబ్రవరి 1న ఆదివారం అయినప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ యథావిధిగా కొనసాగుతుంది. అయితే, అది సెటిల్‌మెంట్ హాలిడే కావడంతో జనవరి 30న కొనుగోలు చేసిన షేర్లను ఫిబ్రవరి 1న అమ్మడానికి వీలుండదు.

వయ్యారి చిత్రం

నేహా శెట్టి





## అవును.. క్యాస్టింగ్ కౌచ్ ఉంది: తమ్మారెడ్డి

టాలీవుడ్ లో క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. 'మన శంకర వరప్రసాద్ గారు' సక్సెస్ మీట్ సందర్భంగా సినిమాలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారానికి ఆజ్యం పోశాయి. సినిమా ఇండస్ట్రీని అద్దంతో పోల్చిన ఆయన... ఇండస్ట్రీ చాలా బాగుందని... అవకాశాల కోసం అడ్డదారులు తొక్కాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి స్పందిస్తూ... ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఉందని చెప్పారు. చిరంజీవి వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితికి భిన్నంగా ఉన్నాయని అన్నారు. చిరంజీవి తొలిరోజుల్లో పరిస్థితులు ఎలా ఉండేవో తమకు తెలియదని... కానీ ఇప్పుడు పరిస్థితులు మొత్తం మారిపోయాయని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇదే అంశంపై నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కూడా స్పందించారు. ఇండస్ట్రీలో వేధింపులు లేవని ఎవరూ చెప్పలేరని ఆయన అన్నారు. తెలుగు సినీ పరిశ్రమలో తొలి రోజుల నుంచే ఈ సమస్య ఉందని చెప్పారు. ఒకప్పుడు రాజ కుటుంబాల వారు, జమీందారులు మహిళల కోసమే సినిమాలు తీసేవారని అన్నారు. ప్రస్తుతం ఏడాదికి దాదాపు 250 సినిమాలు నిర్మితమవుతుంటే... వాటిలో 30 నుంచి 40 సినిమాలు మహిళలను వాడుకునే ధోరణితోనే నిర్మితమవుతున్నాయిని తమ్మారెడ్డి చెప్పారు. లైంగిక వాంఛలు తీర్చుకోవాలనే ధోరణి పరిశ్రమలోని ఒకరిద్దరు సినీ పెద్దల్లో ఉందని అన్నారు. క్యాస్టింగ్ కౌచ్ గురించి చిన్మయి చెప్పింది నిజమేనని చెప్పారు.




## 'వారణాసి' రిలీజ్ డేట్ ఫిక్స్..

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి కాంబోలో తెరకెక్కిస్తున్న మూవీ 'వారణాసి'. ఇది గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ. యావత్ సినీ ప్రియులు ఈ చిత్రం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మహేష్ ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్ అంచనాలను రెట్టింపు చేసింది. ఈ క్రమంలో మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్ చేశారు. తాజాగా మహేష్ సోషల్ మీడియా వేదికగా విడుదల తేదీని అనౌన్స్ చేశారు. 'వారణాసి' సినిమాని 2027 ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు నిన్నటి నుంచి జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ మేరకు వారణాసిలో కొన్ని హోర్డింగ్స్ పెట్టినట్లు సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు వైరల్ అయ్యాయి. అందరూ అనుకున్నట్లుగానే అదే తేదీని మహేష్ బాబు ఇన్స్టాగ్రామ్ వేదికగా అధికారికంగా ప్రకటించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న గ్లోబల్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు.

## సినిమా వేడుకల్లో పాలిటిక్స్ ఏంటి?: ప్రకాశ్ రాజ్

బెంగళూరు వేదికగా జరుగుతున్న 17వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు ప్రకాశ్ రాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 6 వరకు సాగే ఈ ఫెస్టివల్‌లో విభిన్న దేశాలకు చెందిన సినిమాలు ప్రదర్శితమవుతున్నాయి. ఇలాంటి వేడుకల ముఖ్య ఉద్దేశం ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్న ఆలోచనలను, సంస్కృతులను పంచుకోవడమే. అయితే ఇప్పుడు ఈ వేదికలపై కూడా రాజకీయాల నీడ పడుతోందని ప్రకాశ్ రాజ్ అన్నారు. ఈ చలన చిత్రోత్సవాల్లో పాలస్తీనా సినిమాలను ప్రదర్శించకపోవడంపై ప్రకాశ్ రాజ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సినిమాల ఎంపికలో రాజకీయ జోక్యం పెరిగిపోతోందని, ఇది కళాకారుల స్వేచ్ఛను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు నేరుగా విజ్ఞప్తి చేశారు. కేరళ ప్రభుత్వం ఇప్పటికే ఆ సినిమాలను ప్రదర్శించిందని, అదే దారిలో కర్ణాటక కూడా అడుగులు వేయాలని కోరారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సినిమాలను నిషేధించడం వల్ల చిత్రోత్సవాల అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని ప్రకాశ్ రాజ్ అభిప్రాయపడ్డారు. సాహిత్యం, సినిమా అనేవి సమాజంలో మార్పు తీసుకురావడానికి వాడే ఆయుధాలని, వాటిని ఒక పక్షానికే పరిమితం చేయడం సరికాదని చెప్పారు. కేవలం కొన్ని రాజకీయ కారణాల వల్ల సినిమాలను అడ్డుకోవడం వల్ల కొత్త ఆలోచనలు ప్రజల్లోకి వెళ్లకుండా పోతాయని అన్నారు.





## త్రివిక్రమ్ మోసం చేశాడు

ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పై హీరోయిన్ ఈషా రెబ్బ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్రివిక్రమ్ తనను మోసం చేశాడని ఆమె అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'అరవింద సమేత..' సినిమా గురించి మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ చిత్రంలో ఈషా క్యారెక్టర్ రోల్ లో నటించింది. ఆ సమయంలో తనకు ఎన్నో సందేహాలు ఉన్నాయని... ఒక కమర్షియల్ సినిమాలో సైడ్ క్యారెక్టర్స్ చేస్తే భవిష్యత్తులో కూడా తనకు అలాంటి పాత్రలే వస్తాయేమోనని భయపడ్డానని చెప్పారు. అయితే తనది ప్రధానమైన పాత్ర అని త్రివిక్రమ్ చెబితే ఓకే చెప్పానని అన్నారు. పెద్ద బ్యానర్, పెద్ద డైరెక్టర్ కావడంతో నో చెప్పలేకపోయానని తెలిపారు. అయితే, సినిమా విడుదలైన తర్వాత పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని... సినిమాలో నీ పాత్ర ఏముందని తనకు చాలా మంది ఫోన్ చేశారని చెప్పారు. మంచి పాత్ర అని చెప్పి, ప్రాధాన్యత లేని క్యారెక్టర్ ఇచ్చి తనను త్రివిక్రమ్ మోసం చేశాడని అన్నారు.



## కృతి శెట్టికి కలిసి వచ్చేనా?

ఉప్పెన సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కృతి శెట్టి మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ ను అందుకున్నారు. ఉప్పెన హిట్ తో కృతికి మంచి క్రేజ్ ఏర్పడింది. ఆ క్రేజ్ తోనే అమ్మడికి మంచి అవకాశాలు కూడా వచ్చాయి. ఉప్పెన తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలు మంచి ఫలితాల్నే ఇచ్చాయి. కానీ ఆ తర్వాత కృతి చేసిన సినిమాలన్నీ వరుసగా నిరాశ పరుస్తూ వచ్చాయి. మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, ది వారియర్, కస్టడీ, మనమే ఇలా ఆమె చేసిన సినిమాలన్నీ ఒకదాన్ని మించి ఒకటి ఫ్లాపులుగా నిలవడంతో క్రమంగా కృతికి తెలుగులో అవకాశాలు కూడా తగ్గుముఖం పట్టాయి. శర్వానంద్ తో చేసిన మనమే సినిమానే కృతి తెలుగులో చేసిన ఆఖరి సినిమా. తెలుగులో అవకాశాలు తగ్గడంతో కృతి వేరే భాషలపై ఫోకస్ చేసింది. అందులో భాగంగానే తమిళంలో ఓ రెండు సినిమాలకు సైన్ చేసింది. అనుకున్నట్టే తమిళంలో కృతికి మంచి అవకాశాలే వచ్చాయి.

## ఫిబ్రవరి 6న ఓటీటీలోకి రాజాసాబ్

ఎన్నో ప్రయోగాలు చేసిన ప్రభాస్, రీసెంట్ గా మారుతి దర్శకత్వంలో ది రాజాసాబ్ సినిమా చేశారు. సంక్రాంతి కానుకగా రాజా సాబ్ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జనవరి 9న రిలీజైన ఈ మూవీకి ఆడియన్స్ నుంచి మిక్స్డ్ రెస్పాన్స్ వచ్చింది.




సినిమాలో ప్రభాస్ ను వింటేజ్ లుక్ లో చూపించారని మారుతిని ప్రశంసించినప్పటికీ, కథ, స్క్రీన్ ప్లే విషయంలో అతను చాలానే విమర్శలు ఎదుర్కొన్నారు. రాజా సాబ్ లో మారుతి మార్క్ కామెడీ మిస్ అయిందని కొందరు, సినిమా కథకు కనెక్ట్ కాలేదని మరికొందరు, హార్రర్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమాలో హార్రర్ ఎలిమెంట్స్ ఆశించిన విధంగా లేవని ఇంకొందరు విమర్శించారు. అయినప్పటికీ ప్రభాస్ క్రేజ్, సంక్రాంతి సెలవుల వల్ల ది రాజా సాబ్ బాక్సాఫీస్ వద్ద డీసెంట్ గానే కలెక్ట్ చేసింది. ది రాజా సాబ్ మూవీ ఓ వర్గం ఆడియన్స్ ను అలరించినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఈ మూవీపై బాగా నెగిటివిటీ నెలకొంది. ఇదిలా ఉంటే ది రాజా సాబ్ ఇప్పటికే థియేటర్ రన్ ను ముగించుకుంది. దీంతో ఈ మూవీ ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా అని ఎదురుచూసే వారి కోసం ప్రముఖ ఓటీటీ సంస్థ జియో హాట్‌స్టార్ ఆ అప్డేట్ ను ఇచ్చేసింది. రాజా సాబ్ మూవీ ఫిబ్రవరి 6 నుంచి జియో హాట్‌స్టార్ లో స్ట్రీమింగ్ కు రానున్నట్టు అఫీషియల్ గా వెల్లడించింది.

## సుప్రీం కోర్టుకు చేరిన జననాయగన్

తమిళ నటుడు విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమా చుట్టూ నెలకొన్న సెన్సార్ వివాదం ఇప్పుడు సుప్రీం కోర్టు గడప తొక్కింది. ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలన్న సింగిల్ బెంచ్ తీర్పును మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇటీవల రద్దు చేసింది. దీంతో సెన్సార్ బోర్డు నిర్ణయమే ప్రస్తుతానికి చెల్లుబాటు అవుతోంది. అయితే, చిత్ర నిర్మాతలు మద్రాస్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని గ్రహించిన సెన్సార్ బోర్డు, ముందస్తుగా 'కేవియట్ పిటిషన్' దాఖలు చేసింది. నిర్మాతలు పిటిషన్ వేస్తే, తమ వాదన వినకుండా ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయకూడదని బోర్డు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది.







# కిషాన్, అక్షర్ బ్యాక్

## సంజూ శాంసన్‌కు చివరి చాన్స్

న్యూజిలాండ్ తో చివరి టీ20 పోరుకు టీమిండియా సిద్ధమవుతోంది. ఇరు జట్ల మధ్య ఐదో టీ20 శనివారం (జనవరి 31) జరుగుతుంది. తిరువనంతపురం వేదికగా గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. నాలుగో టీ20 ఓడిపోయినా చివరి టీ20లో టీమిండియా ఫేవరేట్ గా బరిలోకి దిగుతోంది. ఇప్పటికే సిరీస్ గెలిచిన టీమిండియా చివరి మ్యాచ్ లో విజయం సాధించి ఘనంగా ముగించాలని భావిస్తుంది. మరోవైపు నాలుగో టీ20లో గెలిచి కాన్ఫిడెంట్ గా ఉన్న కివీస్ ఐదో టీ20లోనూ గెలిచి టీమిండియా ఆధిక్యాన్ని తగ్గించాలని ప్రయత్నాలు చేస్తుంది. ఈ మ్యాచ్ లో ఇండియా రెండు మార్పులతో బరిలోకిదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నాలుగో టీ20 మ్యాచ్ లో గాయంతో మ్యాచ్ కు దూరమైన ఇషాన్ కిషాన్ పూర్తిగా కోలుకొని ఐదో టీ20 ఆడేందుకు సిద్ధమయ్యాడు. తొలి టీ20లో 8 పరుగులే చేసి విఫలమైనా రెండో టీ20 లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 32 బాల్స్‌లోనే 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 76 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఆదివారం (జనవరి 25) జరిగిన మూడో టీ20లోనూ 12 బంతుల్లోనే 28 పరుగులు చేయి జట్టుకు మెరుపు ఆరంభం ఇచ్చాడు. మూడో స్థానంలో బ్యాటింగ్ చేసేందుకు ఈ వికెట్ కీపర్ బ్యాటర్ సిద్ధంగా ఉన్నాడు. కిషాన్ జట్టులోకి వస్తే అర్షదీప్ సింగ్ లేదా జస్ప్రీత్ బుమ్రాలలో ఒకరికి రెస్ట్ ఇవ్వొచ్చు. తొలి టీ20 తర్వాత గాయం కారణంగా జట్టుకు దూరమైన వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ టీమిండియా ప్లేయింగ్ 11లోకి రానున్నాడు. అక్షర్ ప్రస్తుతం పూర్తి ఫిట్ నెస్ సాధించినట్టు తెలుస్తుంది. నాలుగో టీ20 ముందు అక్షర్ నెట్స్‌లో బౌలింగ్ చేస్తూ కనిపించాడు. అక్షర్ జట్టులోకి వస్తే హర్షిత్ రానాపై వేటు పడొచ్చు. వరుసగా నాలుగు టీ20లు ఆడిన హార్దిక్ పాండ్యకు రెస్ట్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. హార్దిక్ స్థానంలో అక్షర్ జట్టులోకి వస్తే రానాప్ ప్లేయింగ్ 11 లో ఉంటాడు. అభిషేక్ శర్మతో పాటు సంజు శాంసన్ ఇన్నింగ్స్ ను ఆరంభించనున్నారు. బ్యాకప్ వికెట్ కీపర్ ఇషాన్ కిషాన్ మూడో స్థానంలో ఆడతాడు. నాలుగో స్థానంలో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ బ్యాటింగ్ కు వస్తాడు. ఐదో స్థానంలో ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యకు రెస్ట్ ఇవ్వనున్నట్టు తెలుస్తుంది. దీంతో శివమ్ దూబే ఐదో స్థానంలో బరిలోకి దిగే అవకాశం ఉంది. ఆరో స్థానంలో రింకూ సింగ్.. ఏడో స్థానంలో అక్షర్ పటేల్ బ్యాటింగ్ చేయనున్నారు. ఎనిమిదో స్థానంలో హర్షిత్ రానాకి ఛాన్స్ దక్కొచ్చు. కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా స్పెషలిస్ట్ బౌలర్లుగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## రోహిత్ శర్మ రికార్డు బ్రేక్

### ఐర్లాండ్ కెప్టెన్ కొత్త రికార్డు

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ పేరిట ఉన్న అత్యంత ప్రతిష్టాత్మకమైన రికార్డును ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ బద్దలు కొట్టారు. క్రికెట్ చరిత్రలో అత్యధిక అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా పాల్ స్టిర్లింగ్ అగ్రస్థానానికి చేరుకున్నారు. దుబాయ్ వేదికగా యూఏఈతో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌తో పాల్ స్టిర్లింగ్ ఈ ఘనత సాధించారు. ఇప్పటివరకు రోహిత్ శర్మ 159 మ్యాచ్‌లతో ఈ రికార్డును తన వద్ద ఉంచుకోగా.. తాజాగా పాల్ స్టిర్లింగ్ తన 160వ మ్యాచ్ ఆడి సరికొత్త రికార్డును నెలకొల్పారు.

**అత్యధిక టీ20లు ఆడిన టాప్-5 ప్లేయర్లు వీరే..**

**పాల్ స్టిర్లింగ్(ఐర్లాండ్ )- 160**
**రోహిత్ శర్మ (భారత్)- 159**
**జార్జ్ డాక్రెల్(ఐర్లాండ్)-153**
**మహ్మద్ నబీ (ఆఫ్ఘనిస్తాన్)-148**
**జోస్ బట్లర్(ఇంగ్లాండ్)- 144**

## ఒలివియా- జాన్ పీర్స్ అద్భుతం

**37 ఏళ్ల రికార్డు బ్రేక్.. ఆతిథ్య జోడీ సరికొత్త చరిత్ర**

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026లో ఆతిథ్య దేశానికి చెందిన జోడీ సరికొత్త చరిత్ర సృష్టించింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో వరుసగా రెండో ఏడాది టైటిల్ గెలుచుకుని,



దశాబ్దాల కాలం నాటి రికార్డులను తిరగరాసింది. మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026లో ఒలివియా గాడెకీ - జాన్ పీర్స్ జోడీ అద్భుతం చేసింది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో ఈ ఆస్ట్రేలియా జోడీ ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టినా మ్లాడెనోవిక్ - మాన్యుయెల్ గినార్డ్ జోడీపై అద్భుత విజయం సాధించి విజేతలుగా నిలిచారు. ఈ విజయంతో గాడెకీ - పీర్స్ జోడీ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ చరిత్రలో ఒక మిక్స్‌డ్ డబుల్స్ జోడీ వరుసగా రెండుసార్లు టైటిల్ నెగ్గడం 37 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. చివరిసారిగా 1989లో యానా నోవోత్నా - జిమ్ పుగ్ జంట ఈ ఘనత సాధించింది. ఒక ఆస్ట్రేలియా జంట వరుసగా రెండుసార్లు తమ సొంత గడ్డపై టైటిల్ నిలబెట్టుకోవడం 62 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. 1964లో మార్గరెట్ కోర్ట్ - కెన్ ఫ్లెచర్ జోడీ చివరిసారిగా ఈ ఫీట్ సాధించింది. రోడ్ లేవర్ ఎరీనాలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. ఫ్రాన్స్ జోడీ ఆది నుంచే దూకుడు ప్రదర్శించి 6-4తో తొలి సెట్‌ను కైవసం చేసుకుంది. గట్టి పోటీ ఎదురైనప్పటికీ, హోమ్ క్రౌడ్ మద్దతుతో ఆస్ట్రేలియా జోడీ పుంజుకుని 6-3తో రెండో సెట్‌ను గెలిచి మ్యాచ్‌ను టైబ్రేకర్ వరకు తీసుకెళ్లింది. 10 పాయింట్ల టైబ్రేకర్‌లో ఒక దశలో గాడెకీ - పీర్స్ 5-7తో వెనుకబడ్డారు. కానీ ఒత్తిడిని అధిగమించి వరుస పాయింట్లతో 10-8తో విజయాన్ని అందుకున్నారు. రెండో ఛాంపియన్‌షిప్ పాయింట్ సాధించగానే స్టేడియం మొత్తం హర్షధ్వానాలతో మారుమోగిపోయింది. ఆస్ట్రేలియా టెన్నిస్ చరిత్రలో ఈ జోడీ పేరు శాశ్వతంగా నిలిచిపోనుంది.



## ఫైనల్లో అల్కరాస్–జొకోవిచ్

కొత్త ఏడాదిలో మొదటి గ్రాండ్‌స్లామ్‌లో కార్లోస్ అల్కారాస్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. అటు.. సిన్నర్‌పై జోకోవిచ్ కూడా గెలుపొందాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అదరగొడుతున్న అల్కరాస్ టాప్ సీడ్ పురుషుల సింగిల్స్ సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు చెక్ పెట్టాడు. అలాఅనీ జ్వెరెవ్ అలవోకగా తలవంచలేదు. స్పెయిన్ కెరటానికి ముచ్చెమటలు పట్టించిన అతడు.. ఐదు గంటల 27 నిమిషాల పాటు పోరాడాడు. కానీ, చివరకు క్లాస్ ఆటతో చెలరేగిన అల్కరాస్‌ను విజయం వరించింది. ఓపెన్ ఎరాలో చిన్నవయసులోనే నాలుగు గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్ చేరిన ఆటగాడిగా అల్కరాస్ రికార్డు నెలకొల్పాడు. నిరుడు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోనూ చెమటోడ్చిన అల్కరాస్‌కు ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ రూపంలో కఠిన ప్రత్యర్థి ఎదురయ్యాడు. అప్పుడు సిన్నర్‌ను ఓడించేందుకు ఐదు గంటలు కష్టపడిన అతడు.. జ్వెరెవ్‌ను మట్టికరిపించేందుకు ఐదు గంటల 27 నిమిషాలు తీసుకున్నాడు. దూకుడైన ఆటతో జర్మనీ కుర్రాడికి షాకిస్తూ వరుసగా రెండు సెట్లు గెలిచిన అల్కరాస్.. నిర్ణయాత్మక సెట్‌ను ఒక్క పాయింట్‌తో కోల్పోయాడు. దాంతో.. నాలుగో సెట్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. దాదాపు ఐదున్నర గంటలు ప్రేక్షకులను అలరించిన ఈ మారథాన్ మ్యాచ్‌లో 6-4, 7-6, 6-7, 7-6, 7-5తో అల్కరాస్ విజేతగా నిలిచాడు. రెండో సెమీఫైనల్లో తలపడుతున్న జన్నిక్ సిన్నర్ , నొవాక్ జకోవిచ్‌లో ఒకరితో అతడు ఫైనల్ ఆడనున్నాడు.

## టీ20 ప్రపంచకప్ అంపైర్ల జాబితా ప్రకటన

**తొలి దశకు 24 మంది అంపైర్లు, 6గురు మ్యాచ్ రిఫరీలు ఎంపిక**


**భారత్-పాక్ కీలక పోరుకు ఇల్లింగ్‌వర్త్, ధర్మసేన అంపైర్లు**

**అంపైర్ల జాబితాలో నితిన్ మీనన్, రిఫరీగా జవగళ్ శ్రీనాథ్‌కు చోటు**

ఫిబ్రవరి 7వ తేదీన ప్రారంభం కానున్న పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌ల కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం మ్యాచ్ అఫీషియల్స్ జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో మొత్తం 24 మంది ఆన్-ఫీల్డ్ అంపైర్లు, ఆరుగురు మ్యాచ్ రిఫరీలు ఉన్నారు. సూపర్-8, నాకౌట్ దశలకు సంబంధించిన అఫీషియల్స్ వివరాలను ఐసీసీ తర్వాత వెల్లడించనుంది. కొలంబోలో పాకిస్థాన్, నెదర్లాండ్స్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌కు కుమార ధర్మసేన, వేన్ నైట్స్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. ఈ మ్యాచ్‌తో నైట్స్ టీ20 ప్రపంచకప్‌లో అరంగేట్రం చేయనున్నాడు. ఇదే మ్యాచ్‌లో నైట్స్ తన 50వ టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌కు అంపైర్‌గా నిలవడం విశేషం. ధర్మసేన గతంలో 2016, 2022 ఫైనల్స్‌తో సహా అనేక కీలక మ్యాచ్‌లకు అంపైరింగ్ చేశాడు. అందరూ ఆసక్తిగా ఎదురుచూసే భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగనుంది. ఈ హై-వోల్టేజ్ పోరుకు రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, కుమార్ ధర్మసేన అంపైర్లుగా వ్యవహరిస్తారు. ఇక ఫిబ్రవరి 7న ముంబైలో అమెరికాతో జరిగే మ్యాచ్‌కు పాల్ రీఫిల్, రాడ్ టక్కర్ అంపైర్లుగా ఉంటారు. భారత్‌కు చెందిన నితిన్ మీనన్ అంపైర్ల జాబితాలో చోటు దక్కించుకోగా, మాజీ పేసర్ జవగళ్ శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీగా ఎంపికయ్యాడు.

**మ్యాచ్ రిఫరీలు:**

డీన్ కాస్కర్, డేవిడ్ గిల్బర్ట్, రంజన్ మడుగలె, ఆండ్రూ



పైక్రాఫ్ట్, రిచీ రిచర్డ్‌సన్, జవగళ్ శ్రీనాథ్.

**అంపైర్లు:**

రోలాండ్ బ్లాక్, క్రిస్ బ్రౌన్, కుమార్ ధర్మసేన, క్రిస్ గఫానీ, అడ్రియన్ హోల్డ్‌స్టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, వేన్ నైట్స్, డొనోవన్ కోచ్, జయరామన్ మదనగోపాల్, నితిన్ మీనన్, శామ్ నోగాజ్‌స్కీ, కేఎన్‌ఏ పద్మనాభన్, అల్లావుద్దీన్ పాలేకర్, అహ్సాన్ రజా, లెస్లీ రీఫర్, పాల్ రీఫిల్, లాంగ్టన్ రుసెరే, షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, ఘాజీ సోహెల్, రాడ్ టక్కర్, అలెక్స్ వార్ఫ్, రవీంద్ర విమలసిరి, ఆసిఫ్ యాకూబ్.

## అండర్ 19 ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ భారత్‌దే

**సరికొత్త చరిత్ర సృష్టించిన జెన్సీ కానాబార్**

టెన్నిస్ ప్రపంచంలో భారత కీర్తి పతాకాన్ని ఓ చిన్నారి రెపరెపలాడించింది. ఆస్ట్రేలియా గడ్డపై భారత యువ టెన్నిస్ సంచలనం జెన్సీ కానాబార్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 14 ఏళ్ల ప్రాయంలోనే ఆస్ట్రేలియన్ ఓపెన్ అండర్-14 టైటిల్‌ను కైవసం చేసుకుని, ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా క్రీడాకారిణిగా నిలిచింది. మెల్‌బోర్న్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జెన్సీ కానాబార్, ఆస్ట్రేలియాకు చెందిన ముసెమ్మా కిలెక్‌తో తలపడింది. ఒకానొక దశలో జెన్సీ 3-6, 0-2తో వెనుకబడి ఓటమి అంచున నిలిచింది. అయితే అసాధారణ పోరాట పటిమను కనబరిచిన ఆమె.. తర్వాతి రెండు రౌండ్లలో 6-4, 6-1 స్కోరుతో ప్రత్యర్థిని చిత్తు చేసి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. గతేడాది బాలుర విభాగంలో అర్ణవ్ పాపర్కర్ ఈ టైటిల్ గెలవగా.. ఇప్పుడు బాలికల విభాగంలో జెన్సీ ఆ రికార్డును సమం చేసింది. గుజరాత్‌లోని జునాగఢ్‌కు చెందిన జెన్సీ కానాబార్ భారత టెన్నిస్ రంగంలో అత్యంత ప్రతిభావంతురాలైన క్రీడాకారిణి. ఆమె ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ అండర్-14, అండర్-16 విభాగాల్లో నెంబర్ 1 ర్యాంకును సొంతం చేసుకుంది.



## పీటీ ఉషా భర్త కన్నుమూత



భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉషా ఇంట విషాదం నెలకొంది. ఆమె భర్త వి. శ్రీనివాసన్ (67) శుక్రవారం ఉదయం హఠాన్మరణం చెందారు. తిక్కోడిలోని వారి నివాసంలో ఉన్నట్టుండి కుప్పకూలిపోయిన ఆయనను కుటుంబసభ్యులు సమీపాన ఉన్న దవాఖానాకు తీసుకెళ్లినా అప్పటికే శ్రీనివాసన్ మరణించినట్టు వైద్యులు తెలిపారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న ఉషా.. విషయం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన కేరళకు చేరుకున్నారు. ప్రధాని మోదీ.. ఉషాకు ఫోన్ చేసి ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 31-1-2026



## వెంకన్నా.. వాళ్లకు 'కొవ్వు' ఎక్కింది!

తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం భక్తులకు అత్యంత పవిత్రమైనది. అయితే, ఈ పవిత్ర ప్రసాదం గత కొంతకాలంగా రాజకీయ వివాదాలకు కేంద్రంగా మారింది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు 'గత ప్రభుత్వ హయాంలో లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యిని వాడారు' అని చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. ఈ వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను ప్రభావితం చేయడమే కాకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడిని వాడుకుంటున్నారనే విమర్శలకు తావిచ్చాయి. కొందరు విశ్లేషకులు ఈ వివాదాన్ని ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఒక ప్రయత్నంగా భావిస్తున్నారు. గత ప్రభుత్వంపై హిందూ వ్యతిరేక ముద్ర వేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని చెప్పడం ద్వారా, గత ప్రభుత్వాన్ని నైతికంగా నిలదీయాలని ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. ఈ వివాదంపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నాయి. 'దేవుడిని రాజకీయాల నుంచి దూరంగా ఉంచండి' అని ధర్మాసనం వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. అధికారికంగా దోషులు ఎవరో తేలకముందే ఆరోపణలు చేయడం సరికాదు. ప్రసాదం తయారీలో వాడే నెయ్యి విషయంలో వచ్చిన ఆరోపణలు భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసేవిగా ఉన్నాయి. చివరికి సీబీఐ విచారణలో 'జంతువుల కొవ్వు' అనే ఆరోపణలకు సరైన ఆధారాలు లభించలేదని తేలింది. చార్జ్‌షీట్‌లో నాసిరకం నెయ్యి లేదా రసాయనాల ప్రస్తావన ఉన్నప్పటికీ, నేరుగా జంతువుల కొవ్వు వాడినట్లు నిరూపితం కాలేదని నివేదికలు స్పష్టం చేశాయి. అయితే, ఈ వివాదాన్ని కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారు, వాడుకుంటున్నారు. రాజకీయాలు ఎన్నికల ప్రక్రియలో ఒక భాగం. అయితే, తిరుమల వంటి పవిత్ర క్షేత్రాన్ని రాజకీయ వివాదాల్లోకి లాగడం వల్ల ఆ సంస్థ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, భక్తుల నమ్మకం కూడా సన్నగిల్లుతుంది. ఆరోపణలు చేసే ముందు వాటికి తగిన ఆధారాలు ఉన్నాయో లేదో చూసుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

*- ఈవార్తలు సంపాదకీయ విభాగం*

## కృతజ్ఞత మరిచిన బంగ్లా

**ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్ పటంలో బంగ్లాదేశ్ ఉనికి కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి పెద్దన్నలా నిలబడింది. 2000 సంవత్సరంలో బంగ్లాదేశ్‌కు టెస్టు హోదా దక్కడంలో అప్పటి బీసీసీఐ అధ్యక్షుడు జగన్మోహన్ దాల్మియా పోషించిన పాత్ర అద్వితీయం. కానీ నేడు, అదే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు రాజకీయ కారణాలతో బీసీసీఐకి వ్యతిరేకంగా పావులు కదుపుతూ, తన ఉనికినే ప్రమాదంలో పడేసుకుంటోంది.**

ఇటీవల ఐపీఎల్ నుంచి ముస్తాఫిజుర్ రెహమాన్ తదితర ఆటగాళ్లను బీసీసీఐ విడుదల చేయడాన్ని నెపంగా చూపుతూ, భారత్‌లో భద్రత లేదంటూ టీ20 ప్రపంచకప్ 2026 మ్యాచ్‌లను తటస్థ వేదికలకు మార్చాలని బీసీబీ మొండిగా పట్టుబట్టింది. ఐసీసీ క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం భద్రత అనే అబద్ధపు సాకును తెరపైకి తెచ్చింది. ఈ వ్యూహం వెనుక బీసీసీఐ ఆధిపత్యాన్ని సవాలు చేయాలనే దుందుడుకు వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ పాకిస్తాన్ వెళ్లనప్పుడు వేదికలు మార్చినట్లే, తమకు కూడా మార్చాలని డిమాండ్ చేసింది. అయితే, ఐసీసీ జరిపిన స్వతంత్ర దర్యాప్తులో భారత్‌లో భద్రతా పరమైన ముప్పు ఏమీ లేదని స్పష్టమైంది. ఫలితంగా, భారత్‌లో ఆడేందుకు నిరాకరించిన బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తొలగించి, ఆ స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించింది ఐసీసీ. బంగ్లా బోర్డు తీసుకున్న ఈ అనాలోచిత నిర్ణయం వల్ల ఆ దేశ క్రికెట్‌కు కోలుకోలేని దెబ్బ తగలనుంది. ఐసీసీ నుంచి ఏటా అందే సుమారు రూ.240 కోట్ల ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలో ఆడే అవకాశం కోల్పోవడం వల్ల ఆటగాళ్ల ర్యాంకింగ్స్, మ్యాచ్ ఫీజులు, బోనస్‌లపై తీవ్ర ప్రభావం పడుతుంది.

పాకిస్థాన్ మినహా మరే ఇతర క్రికెట్ బోర్డు బంగ్లాదేశ్ నిర్ణయానికి మద్దతు తెలపలేదు, ఇది క్రికెట్ ప్రపంచంలో ఆ దేశాన్ని ఒంటరిని చేసింది. క్రీడల్లో రాజకీయాలు జొరబడితే పతనం తప్పదని బంగ్లాదేశ్ ఉదంతం నిరూపిస్తోంది. అగ్రరాజ్యంలా ఎదిగిన బీసీసీఐతో వైరం పెట్టుకోవడం ద్వారా బంగ్లాదేశ్ తన కాళ్లపై తనే గొడ్డలితో కొట్టుకున్నట్లయింది. ఇప్పటికైనా బీసీబీ తన తప్పును తెలుసుకుని, మొండితనాన్ని వీడి క్రికెట్ అభివృద్ధిపై దృష్టి సారించకపోతే, చరిత్రలో కేవలం ఒక వివాదాస్పద బోర్డుగానే మిగిలిపోతుంది.



గుగ్గిల్ల వెంకటేశ్
'ఈవార్తలు' ప్రతినిధి





## భారత జాతీయ పక్షి: నెమలి

భారత ప్రభుత్వం నెమలిని 1963 జనవరి 31న జాతీయ పక్షిగా గుర్తించింది. దాని ప్రత్యేక అందం, సాంస్కృతిక, మతపరమైన ప్రాముఖ్యాన్ని కలిగి ఉండటం, దేశమంతా వ్యాపించి ఉండటం, పురాణాలు, ఇతిహాసాలు, సంప్రదాయాలతో అనుబంధం వల్ల నెమలిని జాతీయ పక్షిగా ఎంపిక చేశారు. భారతీయ సంప్రదాయంలో నెమలి ఈక తెలివి తేటలను సూచిస్తుంది. చక్కదనం, ఆనందం, అందం, ఆప్యాయతను సూచిస్తుంది. భారత వన్య ప్రాణుల (రక్షణ) చట్టం, 1972 ప్రకారం నెమళ్ల వేట, వ్యాపారం నిషేధం.

# వికసిత భారత్ దిశగా ముందడుగు




**ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో, ఫిబ్రవరి 1, 2026న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న తొమ్మిదవ బడ్జెట్ కేవలం వార్షిక ఆదాయ-వ్యయాల పట్టిక మాత్రమే కాదు, 'వికసిత భారత్ 2047' లక్ష్యానికి ఒక బ్లూప్రింట్‌గా నిలవనుంది.బడ్జెట్‌కు ముందు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2026 దేశ ఆర్థిక స్థితిగతులపై స్పష్టమైన చిత్రాన్ని ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి రేటు 7.4 శాతం ఉంటుందని అంచనా ఏర్పడింది.**

ఇది ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో అత్యధికం. ఏప్రిల్-డిసెంబర్ 2025 కాలంలో ద్రవ్యోల్బణం 1.7% కి తగ్గడం సామాన్యుడికి పెద్ద ఊరట.ఇక, 2026-27 నాటికి ద్రవ్య లోటును జీడీపీలో 4.4% కి పరిమితం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, 2026 బడ్జెట్‌లో నాలుగు కీలక వర్గాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. అన్నదాత (రైతులు): వ్యవసాయ రంగంలో డిజిటలైజేషన్, వాతావరణ మార్పులను తట్టుకునే విత్తనాల అభివృద్ధికి పెద్దపీట వేయాలి. యువత (ఉద్యోగ ఉపాధి): స్కిల్ ఇండియా మిషన్ కింద నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించాలి. పేదలు (సంక్షేమం): సామాజిక భద్రత పథకాలకు నిధుల పెంపు ఉండాలి. నారీ శక్తి (మహిళా సాధికారత): ముద్రా లోన్లు, మహిళా సంఘాల బలోపేతం చేయాలి. గత ఎనిమిదేళ్లలో లాజిస్టిక్స్ ఖర్చులు 12% నుండి 8% కి తగ్గాయి. ఈ నేపథ్యంలో హై-కెపాసిటీ కారిడార్లు, రైల్వే ఆధునీకరణకు బడ్జెట్‌లో కేంద్రం ప్రాధాన్యం ఇస్తుందన్న ఆశ కలుగుతోంది. మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌ల ఏర్పాటు ద్వారా రవాణా వ్యయాన్ని మరింత తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో 5జీ విస్తరణ, డిజిటల్ ఆర్థిక లావాదేవీల రక్షణ తక్షణావసరం. ఆదాయపు పన్ను స్లాబుల్లో పెద్ద మార్పులు లేకపోయినా, కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ పెంచే అవకాశం లేకపోలేదు. పన్ను వివాదాల పరిష్కారానికి, రిటర్న్ దాఖలును సులభతరం చేయడానికి టెక్నాలజీని ఉపయోగించే దిశగా ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్న అంచనా ఉంది. ద్రవ్యోల్బణం దృష్ట్యా గృహ రుణంపై వడ్డీ రాయితీలు పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వం నుంచి శుభవార్త ఆశించొచ్చు. చివరగా.. చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్‌లను బలోపేతం చేయనున్నట్లు స్పష్టం అవుతోంది. ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలకు పీఎల్ఐ స్కీమ్‌ల విస్తరణ సానుకూలాంశం కానుంది. పునరుత్పాదక ఇంధన వనరులపై పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఇన్సెంటివ్స్ ఇవ్వాలి. ఏఐ విస్తరించిన నేపథ్యంలో రోబోటిక్స్ వంటి అధునాతన సాంకేతికతల్లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ హెల్త్ మౌలిక సదుపాయాల కల్పన, బీమా రంగంలో మరిన్ని సంస్కరణలు చేపట్టే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అది శుభసూచకం.



శశిధర్ అక్కెల

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.